ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



గుంటూరు జిల్లా వార్తలు

5

ఆదివారం 2 మార్చి 2025

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

- జిల్లాలో 843 మంది విద్యార్థులు గైర్హాజరు
- గుంటూరులోని ఓ కేంద్రంలో ఆలస్యంగా ప్రశ్నపత్రం పంపిణీ




గుంటూరు : మాజేటి గురవయ్య జూనియర్ కళాశాల వద్ద పరీక్షా కేంద్రాల్లో క్యూలో విద్యార్థులు

గుంటూరు(విద్య), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జూనియర్ ఇంటర్ పరీక్షలు ప్ర శాంత వాతావరణంలో శనివారం ప్రారంభ మయ్యాయి. 81 కేంద్రా లను ఏర్పాటు చేయగా అవకతవకలకు అవకా శం లేకుండా ప్రతి కేం ద్రంలో సీసీ కెమేరాలతో నిఘా ఏర్పాటు చేశారు. మొదటి సంవత్సరం పరీక్షలకు జనరల్ విద్యార్థులు 33,783 మందికి 33,072 మంది హాజరయ్యారు. 711 మంది గైర్హాజరయ్యారు. వృత్తి విద్యా కోర్సులకు సంబంధించి 1287 మందికి 1155 మంది మాత్రమే హాజరుకాగా 132 మంది గైర్హాజరయ్యారు. హాజరు 98శాతంగా నమోదైనట్లు ఇంటర్ బోర్డు ఆర్ఐ జీకే జుబేర్ తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది 20 కేంద్రాలు, సిట్టింగ్ స్క్వాడ్ సిబ్బంది 8 కేంద్రాలు, ఆర్ఐవో 4 కేంద్రాల్లో తనిఖీలు చేశారు. తొలిరోజు ఎక్కడా కాపీయింగ్ కేసులు నమోదు కాలేదు. పరీక్షలు ఉదయం 9 గంటలకు ప్రారంభం కాగా 8 గంటలకే విద్యార్థులు కేంద్రాలకు చేరుకున్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రాల్లోకి అనుతించమని ఇంటర్ బోర్డు ముందుగా స్పష్టం చేయడంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులు అప్రమత్తమయ్యారు. గుంటూరు విద్యానగర్‌లోని ఓ కేంద్రంలో ప్రశ్నపత్రాలను ఆలస్యంగా పంపిణీ చేసినట్లు ఫిర్యాదులు వచ్చాయి. సదరు కేంద్రం ఇన్విజిలేటర్లు ఇంటర్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ కేంద్రంలో విద్యార్థులకు అదనంగా మరో 10 నిమిషాల సమయం కేటాయించారు. కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమలు చేశారు.

అమల్లోకి వారబందీ

నేటి నుంచి జోన్-1కు నీటి సరఫరా బంద్



నాగార్జున సాగర్ జలాశయంలో తగ్గిన నీటి నిల్వ

నరసరావుపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ కుడి కాల్వ ఆయకట్టులో ఆదివారం నుంచి వారబందీ అమలు కానున్నది. జోన్-1 పరిధి కాల్వలకు నీటి సరఫరాను నిలిపివేస్తున్నారు. జలాశయంలో నీటి నిల్వలు తగ్గిన నేపథ్యంలో జలవనరుల శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ఉన్న నీటిని సర్ది వాడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. తిరిగి 8వ తేదీ నుంచి నీటి సరఫరా చేయనున్నట్లు జలవనరులశాఖ అధికారులు తెలిపారు. 9 రోజుల పాటు నీటి సరఫరా ఉంటుంది. తదుపరి ఆరు రోజులు నీటి సరఫరాను నిలిపివేస్తారు. వారబందీ అమలుపై వరి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారబందీ విధానంలో మార్చి 31 వరకు పంటలకు నీటి సరఫరా చేయనున్నట్లు జలవనరులశాఖ ఈఈ కృష్ణమోహన్ తెలిపారు. సాగర్ నుంచి కుడి కాల్వ నీటి సరఫరాను 5 వేల క్యూసెక్కులకు తగ్గించారు. సాగర్‌లో 312.05 టీఎంసీలు పూర్తి నిల్వ సామర్థ్యం కాగా 167.17 టీఎంసీల నీటి నిల్వ ఉంది



వినుకొండలో నిలిచిపోయిన ఓవర్ హెడ్ ట్యాంక్ పనులు

నీటి పథకాలకు.. నిధులు

మున్సిపల్ పట్టణాల్లోని ప్రజలకు తాగునీటి కష్టాలు శాశ్వతంగా తీరిపోను న్నాయి. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నిలిచిపోయిన తాగునీటి పథకాల పనులు ఎట్టకేలకు పట్టాలెక్కనున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పట్టణ ప్రజలకు నీటి ఇబ్బందులు తీర్చాలని నిర్ణయించి ఆసియా మౌళిక సదుపాయాలు, పెట్టుబడుల బ్యాంకు(ఏఐఐబీ) నిధులతో రాబేయే 33 సంవత్సరాల జనాభా సంఖ్యను దృష్టిలో పెట్టుకుని తాగునీటి పథకాలను చేపట్టిం ది. వైసీపీ ప్రభుత్వం ఆ నిధులను వాడేసుకుని కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించక పోవడంతో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఈ క్రమంలో అధికా రం చేపట్టిన కూటమి ప్రభుత్వం తిరిగి ఆ పనులపై దృష్టి సారించింది. అయితే ఏఐఐబీ ఒప్పంద గడువు ముగిసింది. దీంతో ఏఐఐబీని రద్దు చేసి ఆ స్థానంలో అర్బన్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్(యుఐడీఎఫ్) అమలుకు సిద్ధమైంది. ఈ క్రమంలో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని తాగునీటి పథకాలకు రూ.961.37 కోట్లు నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పనులు చేపట్టాలని పబ్లిక్‌హెల్త్ శాఖను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశిం చింది. దీంతో త్వరలో ఆయా మున్సిపల్ పట్టణాల్లో తాగునీటి పథకాలు ప్రారంభం కానున్నాయి.

- రూ.961.37 కోట్లు మంజూరు
- గడువు ముగియడంతో ఏఐఐబీ రద్దు
- యుఐడీఎఫ్ పథకంలో పథకాల విస్తరణకు చర్యలు
- వైసీపీ హయాంలో నిలిచిన పనులు ఎట్టకేలకు ప్రారంభం
- పురపాలక సంఘాల్లో తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం



పిడుగురాళ్లలో నిలిచిపోయిన ఓవర్ హెడ్ ట్యాంక్ పనులు

వైసీపీ నిర్లక్ష్యం.. కూటమి శ్రద్ధ

టీడీపీ హయాంలో జరిగిన ఒప్పందం మేరకు తాగునీటి పథకాల విస్తరణకు ఏఐఐబీ నుంచి విడుదలైన నిధులు రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు జమయ్యాయి. అయితే అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం వాటా ధనం విడుదల చేయలేదు. పైగా ఏఐఐబీ నిధులను వాడేసుకుంది. దీంతో తాగునీటి పథకాల విస్తరణ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఐదేళ్లు తాగునీటి పథకాలపై కనీసంగా కూడా దృష్టి సారించకుండా నిర్లక్ష్యం వహించింది. ఎన్నికలకు ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీ మేరకు తాగునీటి పథకాల విస్తరణ పనులపై ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టారు. నిలిచిన పనుల స్థితిగతులు.. వ్యయ అంచనాలను తాజాగా రూపొందించిన ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులను విడుదల చేసింది.

(నరసరావుపేట. ఆంధ్రజ్యోతి)

మున్సిపాల్టీల్లో తాగునీటి పథకాలపై అలుముకున్న నీలినీడలు తొలగిపోతున్నాయి. వైసీపీ హయాంలో నిలిపివేసిన నీటి పథకాల పనులను పట్టాలెక్కించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నిలిచిపోయిన నీటి పథకాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. తాజాగా రూ.961.37 కోట్లు నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గడువు పూర్తవడంతో ఏఐఐబీను రద్దు చేసి దీనిస్థానంలో అర్బన్ యుఐడీఎఫ్ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో తాగునీటి పథకాలపై తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించగా.. కూటమి ప్రభుత్వం ఇబ్బందులను తీర్చేందుకు దృష్టి పెట్టడంపై ఆయా పట్టణాల్లోని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏఐఐబీ నిధులతో వినుకొండ, పిడుగురాళ్ల, మాచర్ల, గుంటూరు కార్పొరేషన్, మంగళగిరి, తాడేపల్లి, అద్దంకి మున్సిపాల్టీలలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో తాగునీటి పథకాల విస్తరణ చేపట్టింది. రానున్న 33 ఏళ్లలో పెరగనున్న జనాభాను అంచనా వేసి ఆయా మున్సిపాల్టీల్లోని నీటి పథ కాల ఆధునికీకరణ పనులు చేపట్టారు. ఏఐఐబీ రుణం 70 శాతం

(మిగతా 8వ పేజీలో)

మునిసిపాల్టీ	నిధులు (రూ. కోట్లలో)
పిడుగురాళ్ల	155.85
మాచర్ల	95.91
వినుకొండ	184.51
గుంటూరు	186.82
మంగళగిరి	105.79
తాడేపల్లి	146.44
అద్దంకి	86.05

వాటర్ గ్రిడ్ సాధ్యంకాకే..

గుంటూరు, పల్నాడు బాపట్ల జిల్లాల్లోని పల్లెలు, పట్టణాల్లో తాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు వాటర్‌గ్రిడ్ ద్వారా నీటిని సరఫరాకు ప్రభుత్వం కసరత్తు చేసింది. అయితే కొన్ని మున్సిపాలిటీల్లో వాటర్‌గ్రిడ్ సాధ్యం కాదని ఇంజనీరింగ్ అధికారులు ఇటీవల తేల్చారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం యుఐడీఎఫ్‌ను అమలు చేస్తోంది. మిగతా మున్సిపాల్టీల్లో అమృత్ 2.0 పథకం కింద నీటి పథకాలను విస్తరించనున్నారు. ఇందుకు సంబంధించిన పనులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అటు అమృత్.. ఇటు యుఐడీఎఫ్ పథకాలతో ముడు జిల్లాల పరిధిలోని మున్సిపాల్టీలలో నీటి పథకాలకు మహర్దశ పట్టనుంది.

8 వెటర్నరీ విద్యార్థులపై వివక్ష

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.28 (ఆదివారం)

సహరి : 5.11 (సోమవారం)

చెల్లని ఓట్లపై అభ్యర్థుల్లో గుబులు

- గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో 10,576 లెక్కింపునకు తిరస్కరణ
- ఈ దఫా ఎక్కువ శాతం పెరిగే అవకాశం

8

డ్వాక్రా @ ఈ-కామర్స్

- ఈ-వ్యాపారంలోకి మహిళల రంగప్రవేశం
- ఆన్‌లైన్‌లో 1050 ఉత్పత్తుల వివరాలు లభ్యం
- ఇప్పటికే 2,800 మంది ఎంటర్‌ప్రెన్యూర్లుగా నమోదు
- ప్రైవేటు ఏజెన్సీతో ఒప్పందం కుదుర్చుకున్న ప్రభుత్వం
- మూడు జిల్లాల్లో పలు దఫాలుగా అవగాహన సదస్సులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

మహిళల స్వయం సాధికారతే లక్ష్యంగా పురుడు పోసుకున్న డ్వాక్రా సంఘాలు దినదిన ప్రవర్ధ మానంగా ఎదిగాయి. వేల సంఖ్యలో గ్రూపులు, లక్షల్లో సభ్యులుగా మహిళలు స్థానిక వ్యాపారాలతో ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు. బ్యాంకులు అందించే రుణాలతో డ్వాక్రా సంఘాలు వారి వారి ఆలోచనలకు తగినట్లు రకరకాల వస్తువులను తయారు చేసి ఎప్పటి నుంచో విక్రయిస్తున్నారు. ఉ మ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా డ్వాక్రా సంఘాలు దాదాపు 1050 రకాలను ఉత్పత్తి చేస్తున్నాయి. వీటిలో అధికశాతం చేతి వృత్తులే. ఆధునికంగా, ఎంతో నాణ్యతతో కూడిన ఆయా వస్తువుల అమ్మ కాలకు సరైన వేదిక లేదు. దీంతో డ్వాక్రా మహిళలు నష్టాలు చవిచూస్తున్నారు. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో డ్వాక్రా గ్రూపులను కానీ, వారు తయారు చేసిన వస్తువులకు ఆదరణ కల్పించే కనీస చర్యలు లేవు. ప్రోత్సాహం, ఆదరణ లేకపోవడం.. మరోవైపు విక్రయాలు లేక నష్టాలతో డ్వాక్రా గ్రూపు మహిళలు అయోమయంలో ఉన్నారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం చంద్రబాబు మానసపుత్రిక అయిన డ్వాక్రా గ్రూపులపై దృష్టి సారించింది. వారి ఉత్పత్తుల అమ్మకాన్ని విస్తృత పరచడం ద్వారా మహిళలు మరింతగా ఆర్థిక స్థిరత్వం సాధించాలనేది కూటమి ప్రభుత్వం లక్ష్యంగా తీసుకుంది. ఈ క్రమంలో డ్వాక్రా మహిళలను ఎంటర్‌ప్రెన్యూర్లుగా తీర్చిదిద్దడానికి ఉన్న అన్ని అవకాశాలపై కసరత్తు చేసింది. ఇందులోభాగంగా డ్వాక్రా ఉత్పత్తులను ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలోకి తీసుకురావడం ద్వారా అమ్మకాల విస్తృతిని పెంచడంతో పాటు పెద్దఎత్తున ప్రచారం కల్పించాలని నిర్ణయించింది. ప్రభుత్వం పరిశ్రమలశాఖ ద్వారా ఓపెన్ నెట్‌వర్క్ డిజిటల్ (ఓఎస్‌డీసీ)తో ఒప్పందం కుదుర్చుకుంది. తొలిదశలో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 2,800 మంది డ్వాక్రా మహిళలను ఆన్‌లైన్‌లో ఎంటర్‌ప్రెన్యూర్లుగా రిజిస్టర్ చేసే ప్రక్రియను డీఆర్‌డీఏ పూర్తి చేసింది. దశలవారీగా అందరినీ ఈ కామర్స్ గొడుగు కిందకు తెస్తామని డీఆర్‌డీఏ చెబుతోంది. ఇందుకు సంబంధించి డ్వాక్రా సంఘాలకు అవగాహన కార్యక్రమాలను కూడా నిర్వహించింది.



ఆన్‌లైన్ ఆర్డర్లకు సంబంధించి డెలివరీకి తినుబండారాలు సిద్ధం చేస్తున్న డ్వాక్రా మహిళలు

డెలివరీ చార్జీలు లేకుండానే..


డ్వాక్రా ఉత్పత్తులకు సంబంధించి ఇప్పటికే ఆన్‌లైన్‌లో అమ్మకాలు కూడా ప్రారంభమయ్యాయి. ఆయా జిల్లాల్లోని వీవోఏలు ఒక్కో గ్రామ సమాఖ్య ద్వారా కనీసం నాలుగు ఉత్పత్తులను ఓఎస్‌డీసీ వెబ్‌సైట్‌లోని మైస్టోర్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. దాదాపు 1050 ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో పెట్టారు. చిరుధాన్యాలతో తయారు చేసిన వస్తువులు, పచ్చళ్ళు, ఇంటి అవసరాలకు పనికొచ్చే సామగ్రి, ఇత్తడి వస్తువులు, చేతి అలంకరణలతో పాటు మరెన్నో ఉత్పత్తులను

(మిగతా 8వ పేజీలో)

అతిపెద్దగా.. ఓఆర్ఆర్



- అమరావతికి మణిహారంగా నిర్మాణం
- 190 కిమీ పొడవు.. 70 మీటర్ల వెడల్పు.. 6 వరసలు
- ఏడు నెలల్లో టెండర్లు.. ఏడాదిలోగా పనులు ప్రారంభం
- మొత్తం ఖర్చు కేంద్రమే భరించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక



మంగళగిరి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఔటర్‌రింగురోడ్డు ఏర్పాటుతో ప్రపంచం, దేశంలో చాలా నగరాలు స్వల్ప వ్యవధిలోనే ఎంతగానో అభివృద్ధి చెందాయి. ఈ పరిస్థితుల్లో రాజధాని అమరావతి నగర నిర్మాణ పనులతోపాటు ఏకకాలంలో ఔటర్‌రింగు రోడ్డును భారీస్థాయిలో నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టుదలతో ఉన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో రాజధాని హైదరాబాద్ చుట్టూ దేశంలోనే అతిపెద్ద ఔటర్‌రింగురోడ్డును నిర్మించిన చంద్రబాబు.. విభజిత రాష్ట్ర రాజధాని అమరావతి చుట్టూ అంతకన్నా పెద్ద ఔటర్‌రింగు రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పైగా రాష్ట్ర ప్రభుత్వానికి నయాపైసా ఖర్చు లేకుండా మొత్తం ఖర్చును కేంద్ర ప్రభుత్వమే భరించేలా ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నారు. సుమారు 190 కిలోమీటర్ల నిడివిలో ఏర్పాటయ్యే ఈ ఓఆర్ఆర్ 70 మీటర్ల వెడల్పుతో ఆరు వరుసలతో దేశంలోనే అతిపెద్ద ఓఆర్ఆర్‌గా నిలవబోతుంది. అమరావతికి మణిహారంగా నిలిచే ఓఆర్ఆర్ ప్రాజెక్టును ఏడాదిలోగా పట్టాలెక్కించి ఆపై మూడేళ్లలోగా పూర్తి చేయాలన్నది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంకల్పంగా ఉంది. భూసేకరణ ప్రక్రియను సత్వరమే ప్రారంభించి వచ్చే ఏడు మాసాలలోగా టెండర్ల ప్రక్రియను కూడా పూర్తి చేయాలని ఎన్‌హెచ్ఏఐ భావిస్తుంది. ఆపై నాలుగైదు మాసాల్లోగా నిర్మాణపనులను మొదలెట్టాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఓఆర్ఆర్ నిర్మాణానికి సుమారు 4,205 ఎకరాలు అవసరమని ప్రాథమికంగా అంచనా వేస్తుండగా అందులో సుమారు 306 ఎకరాల వరకు ప్రభుత్వ భూములు ఉన్నాయి. దీంతో 3,899 ఎకరాలను సేకరిస్తే సరిపోతుందని భావిస్తున్నారు.

కృష్ణా డెల్టాకు మహర్దశ

అమరావతి ఓఆర్ఆర్‌తోపాటు మరో రెండు లింకురోడ్లను అనుసంధానంగా నిర్మించాలని ఎన్‌హెచ్ఏఐ ప్రతిపాదించింది. చినకాకాని వద్ద ఎన్‌హెచ్-16లో కలుస్తున్న విజయవాడ పశ్చిమ బైపాస్‌ను తూర్పుదిశగా సుమారు 17 కిలోమీటర్లు పొడిగిస్తూ ఆరులేన్ల రహదారిని నందివెలుగు వరకు నిర్మించాలని ఎన్‌హెచ్ఏఐ సూచించింది. ఈ కొత్త రహదారి విజయవాడ పశ్చిమబైపాస్-ఎన్‌హెచ్-16ని నందివెలుగు వద్ద ఔటర్‌రింగురోడ్డుతో అనుసంధానం చేస్తుంది. ఈ రహదారితో విజయవాడ తూర్పు బైపాస్ రహదారి అవసరం ఉండదని ఎన్‌హెచ్ఏఐ తేల్చిచెప్పింది. చినకాకాని వద్ద ఎన్‌హెచ్-16తో పశ్చిమ బైపాస్ కలిసే ప్రాంతంలో ప్లవర్‌లీఫ్ ఇంటర్‌ఛేంజ్‌ను సరికొత్తగా నిర్మిస్తారు. ఇక్కడ నుంచి మొదలయ్యే అనుసంధాన రహదారి నంబూరుకు ఉత్తరంగా పెనుమూలి, మంచికలపూడి, కంతంరాజు కొండూరు, దుగ్గిరాల, చింతలపూడికి ఆవలివైపుగా వెళ్లి నందివెలుగు వద్ద ఓఆర్ఆర్‌తో కలుస్తుంది. ఈ రహదారితో పాటు మంగళగిరి-తెనాలి-నారా కోడూరు రూటులో ప్రస్తుతం ఉన్న డబుల్‌లేన్ రోడ్డును నాలుగులేన్ల రహదారిగా అభివృద్ధి చేయబోతున్నట్టు మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. ఇక రెండో లింకురోడ్డు విషయానికొస్తే.. బుడంపాడు వద్ద గుంటూరు హైవే జంక్షన్ నుంచి నారాకోడూరు వరకు సుమారు ఆరున్నర కిలోమీటర్ల పొడవున ఆరులేన్ల రహదారిగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. నారాకోడూరు వద్ద ఓఆర్ఆర్‌తో లింకు చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనికి సంబంధించి మూడు అలైన్‌మెంట్లను పరిశీలిస్తున్నారు.

మూడు దశలు.. 11 ప్యాకేజీలుగా..

ఓఆర్ఆర్‌ను 11 ప్యాకేజీలుగా విభజించి మూడు దశలుగా నిర్మించాలని నిర్ణయించారు. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల నుంచి గుంటూరు జిల్లా పొత్తూరు వరకు 63 కిలోమీటర్ల పొడవునా మొదటి దశలో పనులను చేపట్టబోతున్నారు. ఇందులో కృష్ణానదిపై పల్నాడు జిల్లా బలుసుపాడు- ఎన్టీఆర్ జిల్లా మున్నలూరు మధ్య ఓఆర్ఆర్‌కు పశ్చిమ దిశగా 3.15 కి.మీల పొడవున కొత్త వంతెనను నిర్మిస్తారు. రెండో దశలో గుంటూరు జిల్లా పొత్తూరు నుంచి కృష్ణాజిల్లా పొట్టిపాడు వరకు మరో 65 కిలోమీటర్ల నిడివిలో నిర్మాణ పనులను చేపడతారు. ఈ దశలో కృష్ణానదిపై ఓఆర్ఆర్‌కు తూర్పుదిశలో గుంటూరు జిల్లా మున్నంగి- కృష్ణాజిల్లా వల్లూరుపాలెం మధ్య 4.8 కిలోమీటర్ల పొడవునా వంతెనను నిర్మిస్తారు. మూడో దశలో పొట్టిపాడు నుంచి ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల వరకు 62 కిలోమీటర్ల పనులను చేపట్టి ఓఆర్ఆర్‌ను పూర్తి చేస్తారు. మూడోదశలోనే జికొండూరు సమీపంలో 4.4 కిలోమీటర్ల పొడవున టన్నెల్ నిర్మాణం జరగనున్నది.

రేపటి నుంచి దూర విద్య పది, ఇంటర్ పరీక్షలు

గుంటూరు (విద్య), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సార్వత్రి విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే దూర విద్య పది, ఇంటర్ పరీక్షలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 3వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఇంటర్ దూర విద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఇందుకోసం 11 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. పరీక్షలకు 2,354 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. అదేవిధంగా పది దూర విద్య పరీక్షలు ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షలకు 1133 మంది విద్యార్థులకు హాజరుకానుండగా వారి కోసం 21 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు దూర విద్య కేంద్రం కోఆర్డినేటర్ శ్రీధర్ వెల్లడించారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్ట్ నీటి మట్టం శనివారం నాటికి 529.20 అడుగులు ఉంది. ఇది 166.58 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 6006 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8896 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.85 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	98, 107, 118
చికెన్ విత్ స్కిన్	190.00
చికెన్ స్కిన్ లెస్	200.00

లేమల్లెలో గుడారాల పండగ

● ఈ నెల 6 నుంచి 9 వరకు నిర్వహణ

● 140 ఎకరాల్లో చురుగ్గా ఏర్పాట్లు

అమరావతి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): హోసన్న మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా అమరావతి మండలంలోని లేమల్లె గ్రామంలో 48వ హోసన్న గుడారాల పండగ ఈ నెల 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జరుగుతుందని పాస్టర్ అనిల్ తెలిపారు. హోసన్న మినిస్ట్రీస్‌ను బ్రదర్ హోసన్న 1977లో నెల్లూరు నుంచి వచ్చి లేమల్లె గ్రామంలో ఏర్పాటు చేసి 1993 వరకు ఇక్కడే గుడారాల పండగ నిర్వహించారు. అనంతరం గోరంట్లలో శాశ్వత భవనాలు ఏర్పాటు చేసి అక్కడే గుడారాల పండగ నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం గోరంట్లలో స్థలం అందుబాటులో లేకపోవడంతో లేమల్లె వద్ద వారు కొనుగోలు చేసిన 7.5 ఎకరాలలో హోసన్న మందిరం, సిబ్బందికి వసతి గదులు నిర్మిస్తున్నారు. సమీపంలోని 140 ఎకరాలు కౌలుకు తీసుకుని గుడారాల పండగకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. పగలు, రాత్రి పాస్టర్ల ప్రసంగాలకు వేలాది మంది కూర్చునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. 6వ తేదీ సాయంత్రం 6 గంటలకు పండగ ప్రారంభించి శుక్ర, శనివారాలలో రెండు పూట్ల, ఆదివారం మధ్యాహ్నం వరకు జరిగే


లేమల్లెలో హోసన్న మందిర నిర్మాణం

ప్రార్థనలతో పండగ ముగుస్తుంది. 2000 మంది సేవకులు ఏర్పాట్లు చేస్తున్నారు. పండగకు ఇతర దేశాలలో ఉన్న ప్రవాసాంధ్రులు కూడా హాజరు అవుతారని తెలిపారు. నాలుగు రోజుల పాటు జరిగే పండగకు సుమారు 2 లక్షల మంది విశ్వాసులు హాజరవుతారని ఏర్పాట్లు చేస్తున్నారు. దక్షణ భారతదేశంలోని సుమారు 2000 హోసన్న మందిరాల నుంచి విశ్వాసులు పండగలో పాల్గొంటారని తెలిపారు.

ఘనంగా శంకర్ కంటి ఆసుపత్రి 21వ వార్షిక వేడుకలు

పెదకాకాని, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పెదకాకానిలో కంచి కామకోటి మెడికల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శంకర కంటి ఆస్పత్రి 21వ వార్షిక వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. వేడుకలను హాస్పిటల్ చీఫ్ పాటరన్ మాదాల రత్నగిరి బాబు జ్యోతి ప్రజ్వల చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రత్నగిరి బాబు మాట్లాడుతూ కంచి కామకోటి పీఠాధిపతులు జయేంద్ర సరస్వతి స్వామిజీ కోరిక మేరకు పెదకాకానిలో 4.5 ఎకరాల భూమిని విరాళంగా ఇచ్చారని, ఈ ఆస్పత్రి నిర్మాణం వలన గ్రామీణ ప్రాంత ప్రజలకు కంటి చూపు ప్రసాదిస్తున్నట్లు తెలిపారు. అంధత్వ నివారణలో ఆస్పత్రి అందిస్తున్న సేవలను ఆయన కొనియాడారు. ఆస్పత్రికి మరో రెండు లక్షల విరాళాన్ని ఆయన ప్రకటించారు. డాక్టర్ సుధాకర్ పొట్టి మాట్లాడుతూ ఆస్పత్రి పేదలకు కంటి చూపును అందించడంలో ఎంతో కీలక పాత్ర పోషిస్తుం



ప్రసంగిస్తున్న మాదాల రత్నగిరి బాబు, వేదికపై డాక్టర్ సుధాకర్

దని అన్నారు. మెడికల్ అడ్మినిస్ట్రేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ కౌశిక్ మురళి, యూనిట్ హెడ్ త్రిపుర, మాధవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వైద్య విద్యార్థిని మృతి

● మరో విద్యార్థినికి తీవ్ర గాయాలు

● జూపూడి వద్ద జాతీయ రహదారిపై ఘటన

● కళాశాలకు వెళ్తూ కానరాని లోకాలకు..

విజయవాడ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ వైద్య విద్యార్థిని దుర్మరణం చెందగా, మరో విద్యార్థిని తీవ్ర గాయాలపాలైంది. ఈ ప్రమాదం జూపూడి వద్ద హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి వద్ద శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక నిమ్రా కాలేజీలో గుంటూరులోని శ్యామలానగర్‌కు చెందిన సయ్యద్ తాజ్ అఫ్సా (20) ఎంబీబీఎస్ మూడో సంవత్సరం, చిత్తూరు పట్టణం దుర్గానగర్‌కు చెందిన అర్షా మెహవిష్ (21) ఎంబీబీఎస్ నాల్గో సంవత్సరం చదువుతున్నారు. వీరు పశ్చిమ ఇబ్రహీంపట్నంలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ స్కూటీపై కాలేజీకి వెళ్తారు. రోజూ మాదిరిగానే


మృతురాలు తాజ్ అఫ్సా (ఫైల్)

శనివారం కూడా బయల్దేరారు. కళాశాల వద్ద యూటర్న్ తీసుకుంటున్న వీరిని హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న కారు వేగంగా ఢీకొంది. ప్రమాదంలో తాజ్ అఫ్సా అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మెహవిష్ తీవ్రంగా గాయపడింది. గాయపడిన మెహవిష్‌ను చికిత్స నిమిత్తం నిమ్రాకు తరలించడంతో మిగతా విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడలోని ఓ ప్రైవేట్ కాలేజీకి తరలించారు. ఘటనాస్థలాన్ని సీఐ చంద్రశేఖర్ సందర్శించి మృతదేహాన్ని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి పంపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విధులకు ఆటంకం కలిగించారని సీఐడీ డీఎస్పీ ఫిర్యాదు

చిలకలూరిపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం మురికిపూడి గ్రామానికి చెందిన సింగు అజిత్, అతని సోదరుడు దీపక్ తన విధులకు ఆటంకం కలిగించారని, తనను భయభ్రాంతులకు గురి చేశారని గుంటూరు సీఐడీ డీఎస్పీ గోలి లక్ష్మయ్య చిలకలూరిపేట రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిలకలూరిపేట ఐసీఐసీఐ బ్యాంకు కుంభకోణం కేసులో అజిత్‌ను అరెస్టు చేయడం కోసం సీఐడీ పోలీసులు మురికిపూడికి వెళ్లిన సందర్భంలో ఈ సంఘటన జరిగిందని డీఎస్పీ లక్ష్మయ్య తన ఫిర్యాదులో పేర్కొన్నారు. డీఎస్పీ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశామని చిలకలూరిపేట రూరల్ సీఐ బి.సుబ్బానాయుడు శనివారం తెలిపారు. ఐసీఐసీఐ బ్యాంక్ కుంభకోణం కేసులో బ్యాంకు మేనేజర్ నరేష్‌తో పాటు అజిత్ కీలక నిందితుడిగా ఉన్నారు. వారిద్దరూ కలిసి అనేక అక్రమ నగదు లావాదేవీలు జరిపారు. చిలకలూరిపేట, నరసరావుపేట, విజయవాడలోని బ్యాంకు ఖాతాదారులను దారుణంగా మోసగించారు. మొత్తం రూ.70 కోట్ల మేరకు కుంభకోణం జరిగిందని అధికారుల అంచనా. ఇందులో సుమారు రూ.35 కోట్ల మేరకు అక్రమ లావాదేవీలు అజిత్ జరిపినట్టు సీఐడీ పోలీసులు గుర్తించారు. ఈ మొత్తాన్ని అజిత్ తన ఖాతాతో పాటు, తన కుటుంబ సభ్యుల ఖాతాలకు బదిలీ చేసినట్టు పోలీసులు కనుగొన్నారు. కాగా అజిత్‌ను అరెస్టు చేసి విజయవాడలోని ప్రత్యేక కోర్టులో హాజరు పరిచిన అనంతరం న్యాయమూర్తి అతడికి ఈ నెల 13వ తేదీ వరకు రిమాండ్ విధించగా నెల్లూరు జైలుకు తరలించారు.

పింఛన్ డబ్బుతో ఉద్యోగి పరార్

దాచేపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి మునిసిపాలిటీ పరిధిలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న సంపతి లక్ష్మీ ప్రసాదు పింఛన్, విద్యుత్ బకాయిల సొమ్ముతో కన్పించకుండా పోయినట్టు దాచేపల్లి పోలీసులు శనివారం తెలిపారు. దాచేపల్లి నగర పంచాయతీ కమిషనర్ అప్పారావు ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పింఛన్ డబ్బులు 8,43,500, కరెంటు బిల్లుల డబ్బులు రూ.2.69 లక్షలు వెరసి రూ. 11,12,500 తీసుకొని ఉదయం 9 గంటల నుంచి కన్పించకుండా పోయాడని తెలిపారు. పిడుగురాళ్ళ సచివాలయంలో పని చేసే సంపతి లక్ష్మీ ప్రసాదు దాచేపల్లికి వెల్ఫేర్ అసిస్టెంట్‌గా డిప్యూటేషన్‌పై బదిలీపై వచ్చారు. గత మూడు నెలలుగా పని చేస్తున్నాడు. కన్పించకుండా పోవటంతో కమిషనర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు పెనుగొండ లక్ష్మీనారాయణకు ఆత్మీయ సత్కారం

గుంటూరు(తూర్పు), మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఇన్నర్ రింగ్ రోడ్డు, తనుబుద్ధి బసవి రెడ్డినగర్, శ్రీరామ దామం సమావేశ మందిరంలో ఆదివారం అరసం జాతీయ అధ్యక్షుడు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణకు అత్మీయ సత్కారం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి సభాధ్యక్షులుగా ముప్పా చిన్న బాపిరెడ్డి మెమోరియల్ మేనేజింగ్ ట్రస్ట్ ఎంవీ రామిరెడ్డి వ్యవహరిస్తారని, ఆత్మీయ అతిథులుగా తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు జూలూరి గౌరీశంకర్, అరసం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జీఎస్ చలం, ప్రముఖ రచయిత సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి, ప్రొఫెసర్ సీహెచ్ సుశీలమ్మ, అరసం ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ పాల్గొంటారని వివరించారు.

తెలుగు భాషాభివృద్ధికి నిధులు కేటాయింపుపై హర్షం

గుంటూరు(తూర్పు), మార్చి 1(ఆంధ్రజ్యోతి): తెలుగు భాషాభివృద్ధి, ప్రచారం కోసం రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించడంపై ఏపీ అధికార భాషా కమిషన్ రాష్ట్ర సభ్యులు డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తెలుగు భాషాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విశేష కృషి చేస్తున్నారని అన్నారు. ఇందులో భాగంగా మాతృభాషలోనే ఉత్తర, ప్రత్యుత్తరాలు జరిగేలా అదేశాలు జారీ చేశారని గుర్తు చేశారు. అంతేగాక అధికార భాషా దినోత్సవాన్ని విజయవాడ కేంద్రంగా జరపడంతో పాటు, ఈనెల 30న కవులకు, కళాకారులకు కళారత్న, ఉగాది పురస్కారాలు అందజేస్తుందని వివరించారు. తెలుగు వ్యాప్తి కోసం కృషి చేస్తున్న కూటమి నాయకులకు తెలుగు కవులు, సాహితివేత్తలు, భాషాభిమానులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

చరిత్రలో నిలిచిపోయేలా జనసేన ఆవిర్భావ సభ

గుంటూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని చిత్రాడలో మార్చి 14న జరగనున్న జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభ చరిత్రలో నిలిచిపోయే స్థాయిలో నిర్వహిస్తున్నట్లు జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ల హరి తెలిపారు. శ్రీనివాసరావుతోటలో ఛలో పిఠాపురం వాల్ పోస్టర్లను శనివారం ఆయన ఆవిష్కరించారు. సభకు రెండు తెలుగు రాష్ట్రాల్లోని జన సైనికులతో పాటు దేశ, విదేశాల్లో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకానున్నట్లు హరి తెలిపారు. అవినీతి, అరాచకంతో కునారిల్లుతున్న నేటి రాజకీయాల్లో నీతి, నిబద్ధతతో పార్టీని నడుపుతున్న జనసేనాని పవన్ కల్యాణ్ నేటి తరం రాజకీయ నాయకులకు ఆదర్శంగా నిలుస్తున్నారని ఆయన కొనియాడారు. జిల్లా నుంచి కూడా భారీ సంఖ్యలో జనసేన పార్టీ శ్రేణులు పిఠాపురం సభకు తరలివెళ్లనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు మొహబూబ్ బాషా, మిద్దె నాగరాజు, సోమి ఉదయ్‌కుమార్, కోలా అంజనేయులు, వడ్డె సుబ్బారావు, నందూరిస్వామి, తాడికొండ శ్రీనివాసరావు, ఇళ్లా చిరంజీవి, ఆలా గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం



మృతి చెందిన పాశ్వాన్

గుంటూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం చెందారు. శనివారం వేకువజామున ఏటుకూరు బైపాస్ దగ్గర సర్వీస్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో బీహార్ వాసి మృతి చెందాడు. బీహార్ రాష్ట్రంలోని సంస్థాపూర్ జిల్లా బీదన్ తాలూకాకు చెందిన పింకు పాశ్వాన్ (35) బతుకుదెరువు కోసం మిర్చి యార్డులో కూలి పనులకు నగరానికి వచ్చాడు. మిర్చి యార్డు సమీపంలోని సాయినగర్‌లో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఏటుకూరు రోడ్డు బైపాస్ సర్వీస్ రోడ్డు వద్ద లారీ అన్లోడ్ చేసేందుకు వెళ్లాడు. పని అయిపోయిన తర్వాత తోటి కూలీలతో కలిసి సర్వీసు రోడ్డు దాటుతుండగా చిలకలూరిపేట వైపు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న టీఎస్ 07 యూఎఫ్ 6705 నంబర్ గల కారు అతివేగంగా వచ్చి పాశ్వాన్‌ను ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. రుద్ర చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు పాశ్వాన్ మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడి బావమరిది మనీష్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ విద్యార్థి వాహనం ఢీకొని..

స్థానిక ఈస్ట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏటుకూరు రోడ్డు కమ్యూనిస్టు బొమ్మల సెంటర్ సమీపంలో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే ప్రాంతానికి చెందిన రిక్షా పుల్లర్ ఆదెయ్య (60) మృతి చెందాడు. ఏటుకూరుకు చెందిన ఇంటర్ విద్యార్థి పరీక్షకు ఆలస్యమవుతుండంతో కంగారుగా ద్విచక్రవాహనంపై అతివేగంగా నగరంలోకి వస్తున్నాడు. కమ్యూనిస్టు బొమ్మల సెంటర్ ప్రాంతానికి చెందిన రిక్షా పుల్లర్ ఆదెయ్య రిక్షా తెచ్చుకునేందుకు రోడ్డు దాటుతుండగా అతివేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఇంటర్ విద్యార్థికి కూడా గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన విద్యార్థిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు



బీఆర్ స్టేడియం వద్ద పైప్ లైన్ లీక్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో పెట్టుకొని నగరంలో తాగునీటి సరఫరాకి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, బీఆర్‌స్టేడియం రిజర్వాయర్ దగ్గర పైప్‌లైన్ లీకు మరమ్మతులు శనివారానికి పూర్తి చేసి ఆదివారం ఉదయం నుంచి సరఫరా అందించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. కమిషనర్ మాట్లాడుతూ వేసవిలో నగరంలో తాగునీటి సరఫరాలో ఏ సమస్య రాకుండా రిజర్వాయర్ల వారీగా ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. బీఆర్‌స్టేడియం రిజర్వాయర్ పాత 600 ఎంఎం డయా ఔట్లెట్ ఆర్సీసీ డిస్ట్రిబ్యూషన్ పైప్ లైన్ లీకు మరమ్మతు పనులను నిర్దేశిత గడువుకు ఒక రోజు ఆలస్యంగా పనులు ప్రారంభించినందున శనివారం నాటికి పూర్తి చేసి ఆదివారం ఉదయం నుంచి సరఫరా జరిగేలా ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మూడు వంతెనల దగ్గర జరుగుతున్న పనులను పరిశీలించి, రైలుపేట నుంచి వచ్చే డ్రెయిన్ నీటిని నేరుగా మేజర్ డ్రెయిన్‌లోకి కలిపేలా నూతన కల్వర్ట్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, మూడు వంతెనల వద్ద పెండింగ్ పనులు పూర్తి కావడానికి రైల్వే ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని జీఎంసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరాల్లో పింఛన్ పంపిణీలో పాల్గొని సచివాలయ కార్యదర్శులు పింఛన్‌దారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ అందించాలన్నారు. అనంతరం అమరావతి రోడ్డు ఐడీ హాస్పిటల్ వద్ద అన్న క్యాంటీన్‌లో స్థానికులతో కలిసి టిఫిన్ చేసి ఆహార నాణ్యతపై ప్రజలను అడిగి తెలుసుకొని క్యూఆర్ కోడ్ ద్వారా తమ అభిప్రాయాన్ని ఆన్‌లైన్‌లో తెలిపారు. పర్యటనలో ఈఈ సుందర్రామిరెడ్డి, డీఈఈలు నాగభూషణం, కళ్యాణరావు, ఏసీపీ మల్లికార్జున, ఆర్ఓ రవికిరణ్ రెడ్డి, ఎస్ఎస్ ఆయూబ్ ఖాన్, రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణరెడ్డి, ఏఈలు, టీపీఎస్‌లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

రోడ్లపైన అనధికార మాంసం విక్రయాల నిషేధం

నగరంలోని రోడ్లపై నాటు కోళ్ళు, చేపలు, మాంసం అనధికార విక్రయాలు చేయడానికి వీలులేదని, డివిజన్ల వారీగా అనధికార విక్రయాలు జరగకుండా ప్రజారోగ్య అధికారులు పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. కమిషనర్ మాట్లాడుతూ అనధికార విక్రయాలు చేసే వారికి భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించటమే కాకుండా చట్టప్రకారం కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. మాంసం విక్రయదారులు తప్పనిసరిగా నగరపాలక సంస్థ నుంచి డీ అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్ పొంది వ్యాపారం నిర్వహించుకోవాలని, లైసెన్స్ లేని షాపులను సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు.

ప్రతి ఒక్కరూ హౌస్ హోల్డ్ డేటాలో నమోదై ఉండాలి

రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకు నగరపాలక సంస్థ పరిధిలో నివాసం ఉండే ప్రతి ఒక్కరూ స్థానిక వార్డు సచివాలయం హౌస్ హోల్డ్ డేటాలో తప్పనిసరిగా నమోదై ఉండాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మిస్సింగ్ సిటిజన్ సర్వే చేపట్టిందని, అందులో భాగంగా నగరంలో నివసించే ప్రతి ఒక్కరిని స్థానిక వార్డ్ సచివాలయం పరిధిలో హౌస్ హోల్డ్ డేటాలో నమోదు చేయడం జరుగుతుందన్నారు. భవిష్యత్‌లో భూ పట్టాలు, అడంగల్, పట్టాదారు పాసు పుస్తకాలు, పాస్ పోర్ట్, ఆధార్ సేవలు, పుర సేవలు అందడానికి హౌస్ హోల్డ్ డేటాలో నమోదు తప్పనిసరి అని అన్నారు.

మసీదుల వద్ద ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలి

రంజాన్ పండుగ సందర్భంగా నగరంలో మసీద్‌ల వద్ద ప్రత్యేక పారిశుధ్య పనులు, మౌలిక వసతుల కల్పన చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం టెలికాన్ఫరెన్స్‌లో ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ మాట్లాడుతూ రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లింలు ప్రతి రోజు మసీదుల వద్దకు అధిక సంఖ్యలో ప్రార్థనల కోసం వస్తారని, ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. మసీదుల వద్ద నీటి సదుపాయం, వీధి దీపాల ఏర్పాటు ఉండేలా చూడాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మసీదుల వద్ద పారిశుధ్య సమస్యలు గుర్తిస్తే నగరపాలక సంస్థ కాల్ సెంటర్ 0863-2345103కి కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.



భాష్యం రామకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే మాధవి దంపతులు

భాష్యం రామకృష్ణకు ఎమ్మెల్యే మాధవి జన్మదిన శుభాకాంక్షలు

గుంటూరు కార్పొరేషన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకుని అయనకు గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి దంపతులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొమ్మినేని కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు ముత్తినేని రాజేష్, బంగారు బాబు, మాధవరావు, రఘు మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రైవేటు వైద్యశాలలో కేస్‌షీట్లను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో విజయలక్ష్మి

సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం ఇవ్వండి

● వైద్యులకు డీఎంహెచ్‌వో సూచన

గుంటూరు మెడికల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు గుంటూరు నగరంలో సిజేరియన్ ఆపరేషన్లు ఎక్కువగా జరుగుతున్న ప్రైవేటు ఆసుపత్రులపై శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే.విజయలక్ష్మి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆయా సిజేరియన్ ఆపరేషన్లకు సంబంధించి కేస్ షీట్లను పరిశీలించి సీ సెక్షన్ ఆడిట్ జరిపారు. డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మితో పాటు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఏ.శ్రావణ్‌బాబు, గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు చెందిన గైనకాలజిస్టులు, మత్తు మందు వైద్యులు, మెడికల్ పీజీ విద్యార్థులు బృందంగా ఏర్పడి ఈ తనిఖీలు జరిపారు. నగరంలోని హైమా హాస్పిటల్, ప్రభావతి హాస్పిటల్, కేఎస్‌ఆర్ హాస్పిటల్స్, శ్రీవెంకటేశ్వర నర్సింగ్ హోమ్‌లను ఈ అధికారిక బృందం తనిఖీలు చేసి రికార్డులు పరిశీలించింది. ఆయా గర్భిణులకు సిజేరియన్ ఆపరేషన్‌లు ఎందుకు చేయాల్సి వచ్చిందో తెలుసుకొనేందుకు పేషెంట్స్ కేస్ షీట్లను పరిశీలించారు. హైమా హాస్పిటల్‌లో కేస్ షీట్లు అందుబాటులో లేకపోవడంతో వారికి నోటీసులు జారీ చేశారు. డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ వైద్యనిపుణులు సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అత్యవసర పరిస్థితి ఏర్పడినప్పుడు మాత్రమే సిజేరియన్ ఆపరేషన్లు చేయాలని సూచించారు.

పశ్చిమ డెల్టా కాల్వకు 1216 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 1216 క్యూసెక్కుల సాగునీటిని శనివారం విడుదల చేసినట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.7 అడుగుల నీటి మట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లెకాల్వకు 148 క్యూసెక్కులనీరు, తూర్పుకాల్వకు 126, పశ్చిమకాల్వకు 125, నిజాంపట్నంకాల్వకు 60, కొమ్మమూరుకాల్వకు 482 క్యూసెక్కుల నీరు, విడుదల చేస్తున్నారు.

ముఠా కార్మికుల కూలీ రేట్ల పెంపుదల జీవో విడుదలపై హర్షం

గుంటూరు(తూర్పు), మార్చి 1(ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లయీస్ ముఠా కార్మికుల కూలీ రేట్ల పెంపుదల చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేయడంపై ఏపీ సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ హమాలీ(ముఠా) వర్కర్స్ యూనియన్(ఏ ఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చిన ఆంజనేయులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ఏటుకూరు రోడ్డు, రేగుల రాఘవయ్య భవన్లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఐటీయూసీ పోరాటాల ఫలితంగానే కూలీ రేట్లు పెంపుదల సాధ్యమైందని అన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీవోతో దాదాపు ఐదు వేల మంది కార్మికులకు లబ్ధి చేకూరుతుందని అన్నారు. కార్మికుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని జీవో విడుదల చేసిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు, కమిషనర్, ఎండీలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. యూనియన్ ఉపాధ్యక్షుడు జీ.సురేష్ బాబు మాట్లాడుతూ పెరిగిన రేట్ల ప్రకారం క్వింటాకు రూ.28, దసరా బోనస్ రూ.6,500, ప్రతి కార్మికునికి మూడు జతల యూనిఫామ్, ప్రస్తుతం అమలవుతున్న వేతనంపై రూ వెయ్యి అదనంగా అందుతుందని వివరించారు. సమావేశంలో రావుల అంజిబాబు, కోట్ల మరియదాసు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చల్లా చిన ఆంజనేయులు, పాల్గొన్న ఏఐటీయూసీ నాయకులు

చిప్స్‌లో ముగిసిన రాష్ట్రస్థాయి క్రీడా, విజ్ఞాన దినోత్సవాలు

గుంటూరు(విద్య), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మాస్యూటికల్ సైన్సెస్ (చిప్స్)కళాశాలలో రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న జాతీయ విజ్ఞాన దినోత్సవం, అంతర్ ఫార్మసీ కళాశాలల ఆటల పోటీలు శనివారంతో ముగిశాయి. విద్యార్థినీ, విద్యార్థులకు ఫార్మా క్విజ్, కాంపౌండింగ్-డిస్పెన్సింగ్, కేస్ ప్రజెంటేషన్, కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, రన్నింగ్ పోటీలు నిర్వహించినట్లు కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ కోయ సుబ్బారావు, ఆర్వీఆర్ అండ్ జేసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేస్తున్న కోయి సుబ్బారావు, డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ తదితరులు

నూతన వాహన చట్టంపై అవగాహన

తాడేపల్లి టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 1వ తేదీ నుంచి ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని లేకుంటే నూతన వాహన చట్టం ప్రకారం జరిమానాలు తప్పవని తాడేపల్లి ఎస్‌ఐ నారాయణ అన్నారు. నూతన వాహన చట్ట నిబంధనలు, జరిమానాలు తెలిపే విధంగా ప్రచార బోర్డులను ప్రకాశం బ్యారేజి, కనకదుర్గమ్మ వారధి, ఉండవల్లి కూడలి, తదితర ప్రధాన ప్రాంతాల్లో శనివారం ఏర్పాటు చేశారు.

శ్యామలానగర్ ఖాళీ స్థలాల్లో విషసర్పాల సంచారం

● ఆందోళన చెందుతున్న స్థానికులు

గుంటూరు(తూర్పు), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్యామలానగర్, రెండో లైన్ లో ఉన్న ఖాళీ స్థలాలతో స్థానికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆయా స్థలాల్లో ముళ్ల చెట్లుతో నిండుకున్నాయి. దీంతో స్వరాలు, విష కీటకాలకు ఆవాసంగా మారిపోతున్నాయి. దీంతో చుట్టు పక్కల వారు, మరో వైపు అక్కడే ఉన్న విద్యాసంస్థలో చదువుతున్న విద్యార్థులు, పనిచేసే సిబ్బంది భయంతో కాలం గడుపుతున్నారు. ఖాళీ స్థలం పక్కనే ఉన్న ఒక ఇంటి మరుగుదొడ్డిలోకి ఇటీవల భారీ విష సర్పం వచ్చింది. దీంతో తీవ్ర భయ భ్రాంతులకు గురయ్యారు. దీనిని బయటకు పంపడానికి స్థానికులు ఇబ్బందులు పడ్డారు. ఎటు నుంచి ప్రమాదం వస్తుందనే భయం స్థానికుల్లో నెలకొంది. ఉన్నతాధికారులు స్పందించి ఖాళీ స్థలాల్లో చెట్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



శ్యామలా నగర్, రెండో లైన్ వద్ద దట్టంగా పెరిగిన ముళ్ల చెట్లు



మరుగుదొడ్డిలోకి వచ్చిన విష సర్పం



పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

స్వచ్ఛ గుంటూరు మీ బాధ్యతగా తీసుకోవాలి

● నసీర్‌ను కలిసిన పారిశుధ్య కార్మికులు
● ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామని భరోసా

గుంటూరు కార్పొరేషన్, మార్చి1(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ గుంటూరు మీరు బాధ్యతగా తీసుకోవాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహ్మద్ నసీర్ సూచించారు. ఎమ్మెల్యే ఇంటి వద్దకు శనివారం ఉదయాన్నే పారిశుధ్య కార్మికులు చేరుకున్నారు. పారిశుధ్య కార్మికులు వచ్చారని తెలియగానే ఎమ్మెల్యే నసీర్ వారి వద్దకు వచ్చారు. దీంతో వారు తాము ఉంటున్న ప్రాంతానికి, పని చేసే ప్రాంతానికి చాలా దూరం ఉంటుంది. టైముకు వెళ్లి రావడానికి ఇబ్బందిగా ఉందని, వచ్చే డబ్బుల్లో ఆటోలకే కొంత పోతుంది.. తాము ఉండే ప్రాంతంలోనే పని చేసేట్టు చూడండయ్యా' అంటూ కార్మికులు ఎమ్మెల్యేను వేడుకున్నారు. ఎమ్మెల్యే సమస్యను ఆలకించి కమిషనర్‌తోపాటు సీఎంహెచ్‌వోకు ఫోన్ చేసి మాట్లాడారు. పారిశుధ్య కార్మికుల ఆధార్ కార్డులను పరిశీలించి, వారు నివాసం ఉండే ప్రాంతాలకు దగ్గరగా డ్యూటీలు కేటాయించాలని సూచించారు. ఈ ప్రక్రియ వెంటనే ప్రారంభించాలన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతూ ఎప్పుడు ఏ సమస్య వచ్చినా తాను అందుబాటులో ఉంటానని, గుంటూరును స్వచ్ఛంగా తీర్చిదిద్దాలని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంటూరులో పారిశుధ్య కార్మికులకు అవసరమైన పుష్‌కాట్‌లు, డస్ట్ బిన్లు వంటి సామగ్రి సమకూర్చామని, పీఎఫ్ వంటి సమస్యలను పరిష్కరించామని తెలిపారు. కార్మికుల భద్రత, శ్రేయస్సు కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. దీంతో కార్మికులు సంతోషంగా వెనుదిరిగారు.



ఎమ్మెల్యే మాధవిని సత్కరిస్తున్న చిన్మయ విద్య మిషన్ ప్రతినిధులు

ఒత్తిడి లేని విద్యను అందించే బాధ్యత ఉపాధ్యాయులదే

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు కార్పొరేషన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్కూల్స్‌లో చదివే విద్యార్థులు ఆనందంగా చదువుకోవాలి కానీ, ఒత్తిడితో కాదని, అందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారికి సహకరించాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి కోరారు. గుంటూరు ఎస్‌వీఎన్ కాలనీలో చిన్మయ్య విద్యాలయం స్కూల్ వార్షికోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. విద్యార్థుల చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకర్షించాయి. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఆటపాటలు కూడా చాలా అవసరం అని, విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో ఉండాలన్నారు. అప్పుడే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అందుకోవడానికి అర్హత సాధిస్తారని, తల్లిదండ్రులకు మంచిపేరు తెచ్చిపెట్టే విధంగా నడవడిక ఉండాలని ఎమ్మెల్యే తెలిపారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు సాంకేతికతను అందిపుచ్చుకొని, విద్యతో పాటు నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఎమ్మెల్యే బహుమతులు అందజేసారు.



అనుగ్రహ భాషణం చేస్తున్న రామానుజ జీయర్‌స్వామి, పక్కన యలమంచిలి శివాజీ తదితరులు

వైభవంగా మహాకుంభాభిషేక మహోత్సవాలు ప్రారంభం

గుంటూరు(తూర్పు), మార్చి 1(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టబంధన మహాసంప్రోక్షణ సమేత మహా కుంభాభిషేక మహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూల విరాట్‌లకు విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణ జరిగాయి. టీటీడీ ఆగమ పండితులు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు, అగ్నిహోత్ర శోభనాచల లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో విస్వక్సేనారాధన, పుణ్యావచనం, మేదినిపూజ, అంకురార్పణ, వేదస్వస్తి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య అధ్యక్షత వహించారు. అష్టాక్షరి సంపత్కుమార రామానుజ జీయర్‌స్వామి, బ్రహ్మానిష్టానంద సరస్వతీస్వామి, బృందావన్ జీయర్ స్వామి భక్తులను ఉద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ కోగంటి వెంకట శ్రీరంగనాయకి కుంభాభిషేక విశిష్టతను వివరించారు. సభలో అతిథులుగా మాజీ ఎంపీ డాక్టర్ యలమంచిలి శివాజీ, రాష్ట్ర బీజేపీ నాయకుడు జూపూడి రంగరాజు, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ బొల్లేపల్లి సత్యనారాయణ, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



విఘ్నేశ్వరునికి అభిషేకం చేస్తున్న విశ్వయోగి విశ్వంజీ

ఘనంగా విశ్వంజీ జన్మదిన వేడుకలు

ప్రత్తిపాడు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): విశ్వగురు పీఠాధిపతి విశ్వయోగి విశ్వంజీ 81వ జన్మదిన వేడుకలు మండల పరిధిలోని చినకోండ్రుపాడు విశ్వనగర్‌లో ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమాలలో తొలి రోజు ఆశ్రమంలోని విగ్రహాలకు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. 108 కలశములతో కల్పవృక్ష వరసిద్ధి వినాయకునికి విశ్వయోగి విశ్వంజీ అభిషేకం నిర్వహించారు. అనంతరం హారతి, మహానైవేద్యం కార్యక్రమాలు కన్నుల పండుగలా జరిగాయి. ఈ వేడుకలకు దేశ, విదేశాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

చెల్లని ఓట్లపై అభ్యర్థుల్లో గుబులు

● గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో 10,576 లెక్కింపునకు తిరస్కరణ

● ఈ దఫా ఎక్కువ శాతం పెరిగే అవకాశం



ఓట్ల లెక్కింపు కేంద్రంలో సిబ్బందికి ఏర్పాటుచేసిన శిక్షణ తరగతుల్లో కలెక్టర్, ఆరు జిల్లాల అధికారులు

గుంటూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు మరో 24 గంటల్లో ప్రారంభం కానుంది. ఈ నెల 3వ తేదీ ఉదయం 8 గంటలకు గుంటూరు నగరంలోని ఏసీ కళాశాల ప్రేయర్‌హాల్‌లో కౌంటింగ్ ప్రక్రియకి శ్రీకారం చుడతారు. ఈ నేపథ్యంలో పోటీలో ఉన్న ప్రధాన అభ్యర్థులు చెల్లని ఓట్ల సంఖ్య ఎంత ఉంటుందనే దానిపై ఆందోళన చెందుతున్నారు. ఇందుకు కారణం క్రితంసారి ఈ నియోజకవర్గానికి ఎన్నికలు జరిగినప్పుడు 10,576 ఓట్లు చెల్లుబాటు కాకుండా పోయాయి. అప్పట్లో పోలింగ్ అయిన ఓట్ల సంఖ్య కూడా 1,49,158 మాత్రమే. ఈ దఫా 2,41,502 ఓట్లు అంటే దాదాపుగా 92,344 ఓట్లు అధికంగా పోలింగ్ అయ్యాయి. దీనిని పరిగణనలోకి తీసుకొంటే చెల్లని ఓట్లు ఎన్ని వేలల్లో ఉంటాయనే దానిపై ఒక అంచనాకు రాలేకపోతున్నారు. ఒక వేళ వీటి సంఖ్య ఎక్కువగా ఉంటే అభ్యర్థుల జయ, అపజయాలపై ప్రభావం చూపే అవకాశం లేకపోలేదు.

ఓటింగ్‌పై స్పష్టత లేకపోవడమే..

ఈ దఫా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలింగ్ శాతం గణనీయంగా పెరిగింది. గతంలో 60 శాతం లోపే ఉన్న పోలింగ్ ఈసారి 69.57 శాతానికి ఎగబాకింది. అయితే పోలింగ్ బూత్‌ల వద్దకు ఓటర్లు వచ్చిన సందర్భంలో ఈ దఫా కొత్తగా ఓటు వేయబోతున్న ఓటర్లలో చాలామందికి ఓటింగ్ విధానంపై స్పష్టత కొరవడింది. నిబంధనల మేరకు ప్రిసైడింగ్ అధికారి ఇచ్చిన బ్యాలెట్ పేపర్‌లో ఏ అభ్యర్థికి తొలి ప్రాధాన్య ఓటు వేయదలిచారో ఆ అభ్యర్థి పేరు పక్కన ఉన్న గడిలో 1 అని అంకె వేస్తే సరిపోతుంది. అది కూడా పీవో సమకూర్చిన వంకాయరంగు ఇంకు పెన్నుతో మాత్రమే నమోదు చేయాలి. ఆ తర్వాత అభ్యర్థుల వారీగా ఎంతమంది ఉంటే అంతమందికి 2, 3, 4, 5... ఇలా ప్రాధాన్యతలను ఇచ్చుకోవచ్చు. ఈ ఓటు చెల్లుబాటు అవుతుంది. ఒక వేళ 1 అంకె వేసి దాని చుట్టూత సున్నా చుట్టినా చెల్లదు. అలానే ఆంగ్లం, తెలుగులో అక్షరాలతో రాయకూడదు. రైట్, ఇంటూ టిక్ మార్కులు చేయకూడదు. ఈ నిబంధనల నేపథ్యంలో ఎన్ని ఓట్లు చెల్లుబాటు కాకుండా పోతాయోనని అభ్యర్థుల అనుచరులు మదనపడుతున్నారు. డ్యూటీ పాసుతో దరఖాస్తు చేసుకొన్న ఉద్యోగుల్లో 590 మందికి పోస్టల్ బ్యాలెట్‌లు పంపిణీ చేశారు. వాళ్లలో ఇప్పటి వరకు 274 మంది ఆర్‌వో కార్యాలయానికి పోస్టు ద్వారా ఓటు వేసిన బ్యాలెట్ పేపర్లను తిరిగి పంపించారు.

ఓట్ల లెక్కింపు సమయంలో అప్రమత్తంగా ఉండాలి

ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియలో అప్రమత్తంగా ఉండాలని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి కౌంటింగ్ సిబ్బంది, పర్యవేక్షణ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక ఏసీ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ హాల్‌లో ఆర్‌వోతో పాటు సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, కృష్ణ జిల్లా సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా, నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్‌లతో సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి మాట్లాడుతూ శాసనమండలి ఎన్నికల బ్యాలెట్ పేపర్ల లెక్కింపులో పూర్తి ఏకాగ్రతతో సమర్థవంతంగా కౌంటింగ్ సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. చెల్లుబాటు అయ్యే ఓట్లు, చెల్లని ఓట్లుకు సంబంధించి ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలపై కౌంటింగ్ సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండి లెక్కింపు సమయంలో ఖచ్చితమైన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓట్లు లెక్కింపు సమయానికి నిర్దేశిత ఆధిక్యం రాకపోతే, పోటీలో ఉన్న అతి తక్కువ మెజార్టీ వచ్చిన అభ్యర్థుల ఓట్లలో తదుపరి ప్రాధాన్యత ఓట్లను ఇతర అభ్యర్థులకు కేటాయిస్తూ ఆ అభ్యర్థిని ఎలిమినేట్ చేస్తూ కౌంటింగ్ ప్రక్రియ కొనసాగించాల్సి ఉంటుందన్నారు. 483 పోలింగ్ బూత్‌లలో నిర్వహిస్తున్నందున ఓట్లు లెక్కింపునకు 28 టేబుల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలో ఓట్లు లెక్కింపు సమయంలో పాటించాల్సిన నిబంధనలు, అనుసరించాల్సిన విధానాలపై ఆర్‌వో నాగలక్ష్మి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రం వద్దకు వచ్చిన బ్యాలెట్ బాక్స్‌లు తీసుకువచ్చినప్పుడు పోలింగ్ కేంద్రం, పోలైన ఓట్లు, తదితర వివరాలు పూర్తిగా సరిచూసుకొని బాక్స్‌లు ఓపెన్ చేసి కౌంటింగ్ ప్రారంభించాలన్నారు. సమావేశంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఎన్టీఆర్ జిల్లాల డీఆర్‌వోలు ఎన్ ఎస్‌కే ఖాజావలి, మురళి, గంగాధర గౌడ్, చంద్రశేఖర్, ఏలూరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ముక్కంటి పాల్గొన్నారు.

పీఎంజీఎస్‌వై కింద రూ. 143.24 కోట్లు మంజూరు

● గుంటూరు జిల్లాలో 12 రహదారులు, ఒక వంతెన

● వెల్లడించిన పెమ్మసాని, ఎమ్మెల్యేలు



వివరాలు వెల్లడిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

తాడేపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన ఫేజ్ 3 కింద రహదారులు, వంతెనల నిర్మాణం నిమిత్తం రూ.143.24కోట్లు మంజూరయ్యాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కొలనుకొండలోని జయభేరి ది క్యాపిటల్ అపార్టుమెంట్‌లో ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, మహమ్మద్ నసీర్ అహ్మద్, తెనాలి శ్రావణ్‌కుమార్, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌తో కలిసి శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలు వివరాలు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎక్కడెక్కడ కేంద్ర ప్రభుత్వం నిధులు అవసరమో ఆయా పనులు గుర్తించి క్రమపద్ధతిలో డీపీఆర్‌లు తయారు చేశామనీ, నిధులు తెచ్చి ఎమ్మెల్యేల సహకారంతో ఆయా ప్రాంతాల్లో రహదారులు, వంతెనల నిర్మాణ పనుల మంజూరుకు కృషి చేశామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.

గుంటూరు జిల్లాలో 12 రహదారులు

గుంటూరు జిల్లాలో 78.51 కిలోమీటర్ల మేర నిర్మాణ పనులకు రూ.89.24కోట్లు మంజూరు కాగా వాటిలో కేంద్ర వాటా రూ.53.544కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.35.696 కోట్లుగా ఉందని మిగిలిన వాటి వివరాలను పెమ్మసాని వివరించారు.

పొన్నూరు నియోజకవర్గ పరిధిలో..

పొన్నూరు నియోజవర్గ పరిధిలో చేబ్రోలు మండలంలోని తెనాలి ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి కొలకలూరు వరకు 7.38 కిలోమీటర్ల మేర నిర్మాణానికి రూ.7.10 కోట్లు, ఇదే మండలంలోని శ్రీరంగపురం బకింగ్ హామ్ కెనాల్ నుంచి భట్టిప్రోలు బ్రాహ్మణకోడూరు రోడ్డు (వయా తోట్లపాలెం) 4.86 కిలోమీటర్లుకు రూ.5.24 కోట్లు, పెదకాకాని మండలంలోని దేవరాయబొట్లపాలెం నుంచి కొప్పురావూరు వరకు 8.31 కి.మీ.కు రూ.11.52 కోట్లు, వెరసి మొత్తం 21.55 కి.మీ.గానూ రూ. 23.86 కోట్లు మేర పనులు జరగనున్నాయి.

ప్రతిపాడు నియోజకవర్గ పరిధిలో...

పెదనందిపాడు మండలంలో పెదనందిపాడు ఆర్‌బీ రోడ్డు నుంచి నాగభైరవపాలెం (వయా పరిటాలవారి పాలెం) వరకు 5.541 కి.మీ.కు రూ.4.47 కోట్లు, ఈదులపాలెం నుంచి ఓల్డ్ మద్రాస్ రోడ్డు 13.9 కి.మీ వద్ద (వయా యనమదల - తిక్కిరెడ్డిపాలెం) 6.097 కి.మీ.కు రూ.10.30 కోట్లు, వట్టిచెరుకూరు మండలం ముత్తూరు నుంచి బురదగుంట మాలపల్లి (వయా కారంపూడిపాడు, సొపాడు) 10.594 కి.మీ.కు రూ.11.58 కోట్లు వెరసి మొత్తం 22.232 కి.మీ.గానూ రూ. 26.35 కోట్లు మేర పనులు జరగనున్నాయి.

తాడికొండ నియోజకవర్గ పరిధిలో..

ఫిరంగిపురం మండలం నరసరావుపేట ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి గుండాలపాడు (వయా పొనుగుపాడు) 5.65 కి. మీ.కు రూ.4.12 కోట్లు, తుళ్ళూరు మండలం పెదపరిమి నుంచి మోతడక 4.88కి.మీ.కు రూ.8.24కోట్లు వెరసి మొత్తం 10.145కి.మీ.కు రూ.12.36కోట్లమేర పనులు జరగనున్నాయి.

తెనాలి నియోజకవర్గ పరిధిలో...

కొల్లిపర మండలంలోని కుంచవరం, దంతలూరు, ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి తెనాలి సిరిపురం ఆర్‌అండ్‌బీ రోడ్డు (వయా అత్తోట యాదవపాలెం, అత్తోట, నేలపాడు) 5 కి.మీ.కు రూ.4.09 కోట్లు, గుంటూరు హనుమాన్‌పాలెం, ఆర్‌బీ రోడ్డు 33.80 కి.మీ అన్నవరం దళితవాడ (వయా తూములూరు, హనుమాన్‌పాలెం, అన్నవరం) 3.853 కి.మీ.కు రూ.4.35 కోట్లు, తెనాలి నుంచి పెదరావూరు (వయా కఠెవరం, కోపల్లె, జేఎంజే కాలేజి, సుందరయ్యనగర్, మల్లిపాడు) 10.447 కి.మీ.కు రూ.11.10కోట్లు వెరసి మొత్తం 19.3 కిలోమీటర్లు రూ.20.35కోట్ల మేర పనులు జరగనున్నాయి.

లంక గ్రామాల్లో వంతెన

గుంటూరు జిల్లాలో 25 వేల మంది లంక గ్రామాల వాసులకు ఉపయోగకరంగా ఉండేందుకు వంతెన నిర్మాణం అవసరం కాగా రూ.54 కోట్లు మంజూరు కావల్సి ఉందనీ, అయితే పీఎంజీఎస్‌వై ఫేజ్ 3 కింద నామ్స్ ప్రకారం కేంద్ర ప్రభుత్వం పదికోట్ల నిధులు మంజూరుచేసిందనీ, అయితే రాష్ట్ర ప్రభుత్వం రూ.40కోట్లు వెచ్చించాల్సి ఉంటుందని, ఫండ్స్ రాగానే ఈ పనులు కూడా కొద్దిగా లేట్ అయినా ప్రారంభిస్తామని పెమ్మసాని చెప్పారు. అన్నవరం దళితవాడ వయా తూములూరు, హనుమాన్‌పాలెం, అన్నవరం వద్ద 468.98 మీటర్ల మేర ఆర్‌అండ్‌బీ రహదారి వంతెన నిర్మించాల్సి ఉంటుందన్నారు.

పట్టణంలోనే రెండు సెంట్లు కోరుతున్నారు

గుంటూరు ఇన్నర్‌రింగ్‌రోడ్‌కు సంబంధించి 320 ఇళ్లు ఖాళీ చేయించాల్సి ఉంటుందనీ, అయితే అందరూ పేదలు కావడం, వారందరూ సీఎం చంద్రబాబు ఇస్తామన్న రెండు సెంట్ల స్థలం పట్టణంలోనే ఇవ్వాలని కోరుతున్నారని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు చెప్పారు. ఎవరికి ఇబ్బందులు కలగకుండా చూస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం ఏమీ పట్టించుకోలేదన్నారు.

పెమ్మసాని.. యమా స్పీడ్

ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ యమా స్పీడ్‌గా పనులు చేయిస్తున్నారని, కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి పనుల శాంక్షన్‌కు కృషి చేస్తున్నారని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ వ్యాఖ్యానించారు. లంక గ్రామాలలో వంతెనకు సంబంధించి వచ్చే ఏడాది వరకు సమయం పడుతుందని అనుకున్నానని కానీ పెమ్మసాని కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి నిబంధనల ప్రకారం రూ.10కోట్లు కేటాయింపజేశారని వ్యాఖ్యానించారు.

ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

గుంటూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణ - గుంటూరు పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 3వ తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఏర్పాట్లను రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్ పరిశీలించారు. శనివారం సాయంత్రం ఇరువురు జిల్లా అధికారులు ఏసీ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రానికి చేరుకొని ప్రేయర్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు టేబుళ్లను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో గుంటూరు ఆర్‌డీవో కె.శ్రీనివాస రావు, గుంటూరు తూర్పు, పశ్చిమ మండల తహసీల్దార్లు నగేష్, వెంకటేశ్వర్లు, రెవెన్యూ, సర్వే, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



ఏసీ కళాశాలలోని ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

డ్వాక్రా @ ఈ కామర్స్



ఆన్‌లైన్ అమ్మకాలపై డ్వాక్రా సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తున్న బాపట్ల జిల్లా డీఆర్‌డీఏ పీడీ పి. పద్మ (ఫైల్‌ఫొటో)

(5వ పేజీ తరువాయి)

ఓఎన్‌డీసీ పోర్టల్‌లో ఉంచారు. ఈ వేదిక ద్వారా డ్వాక్రా ఉత్పత్తులను బుక్ చేసుకునే వినియోగదారులపై అదనపు భారం పడకుండా డెలివరీ చార్జీలను ప్రభుత్వమే భరించేలా మార్గదర్శకాలు జారీ చేసింది. దీంతో ఇతర ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలతో పోల్చుకుంటే చౌకగా వస్తువులు దొరికే వీలున్నందున భవిష్యత్‌లో పెద్దఎత్తున డ్వాక్రా ఉత్పత్తులు ఆన్‌లైన్‌లో విక్రయాలు జరగడం ఖాయమనే ఆశాభావాన్ని ప్రభుత్వం వ్యక్తం చేస్తోంది. ఈ ప్రక్రియపై ప్రజల్లో ప్రచారం కల్పించాల్సి ఉంది. దిగ్గజ కంపెనీల ఉత్పత్తులన్నీ బ్రాండ్‌ను ప్రమో ట్ చేసుకుంటూ పెద్దఎత్తున ఆన్‌లైన్ వాటాను చేజిక్కించుకున్నాయి. ఓ అంచనా ప్రకారం ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఆన్‌లైన్ వేదికల మీద ఇంటి అవసరాలకు ఉపయోగపడే సామగ్రిపై రోజుకు జరిగే వ్యాపారం అక్షరాల రూ.4 కోట్లుగా లెక్క తేల్చారు. ఈ పోటీని తట్టుకుని డ్వాక్రా మహిళలు నిలబడడానికి ప్రభుత్వం ఇచ్చే ఊతానికి తోడు వారు కూడా అవగాహన తెచ్చుకోవడంతో పాటు వినూత్న పద్ధతులలో తమ ఉత్పత్తులను ప్రమోట్ చేసుకోవాల్సి ఉంటుంది.

జిల్లాల వారీగా ఇలా...

బాపట్ల జిల్లాలో 1024 గ్రామైక్య సంఘాలలో 33,430 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. పల్నాడు జిల్లాలో 1050 సంఘాలకు 35,000 మంది, గుంటూరు జిల్లాలో 575 సంఘాలలో 16,500 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ఆయా గ్రామైక్య సంఘాల నుంచి ఆసక్తితో పాటు ప్రాథమికంగా ఆన్‌లైన్‌పై అవగాహన కలిగిన వారిని ఎంపిక చేసి ఎంటర్‌ప్రెన్యూర్లుగా డీఆర్‌డీఏ రిజిస్ట్రేషన్ చేసింది. ఒక్క బాపట్ల జిల్లాలోనే వీరి సంఖ్య 693గా ఉండగా ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే 2,800గా ఉంది. ఇప్పటికే ఆన్‌లైన్ వేదికగా జరిగిన లావాదేవీల మొత్తం ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే రెండు లక్షల దాకా ఉన్నట్లు యంత్రాంగం చెబుతోంది. ఎన్నో వ్యయప్రయాసల కోర్చి నాణ్యతతో ఉత్పత్తులు తయారు చేస్తున్నా మార్కెటింగ్ అవకాశాలు లేక ఇబ్బందులు పడిన తమకు కూటమి ప్రభుత్వం తీసుకున్న స్మార్ట్ నిర్ణయంతో లబ్ధి చేకూరనున్నదని డ్వాక్రా మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నీటి పథకాలకు.. నిధులు

(5వ పేజీ తరువాయి)

30 శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటా ధనంగా కేంద్ర ప్రభుత్వం ఒప్పందం చేసింది. ఏఐఐబీ ఇచ్చే రుణంను కేంద్ర ప్రభుత్వమే తిరిగి చెల్లిస్తుంది. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ నిధులను వాడేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన 30 శాతం నిధుల మాట ఎలా ఉన్నా రుణం నిధులను దారి మళ్లించడంతో పథకాలు నిలిచిపోయాయి. ఐదేళ్ల తాగునీటి పథకాల విస్తరణ పనులపైన, ప్రజల తాగునీటి ఇబ్బందులపైన వైసీపీ పాలకులు దృష్టి సారించలేదు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు మున్సిపాల్టీలలో తాగునీటి సమస్యలు పరిష్కారిస్తామని, తాగునీటి పథకాలను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చింది. అధికారం చేపట్టిన తర్వాత ఆ పనులపై దృష్టి సారించింది. అయితే ఏఐఐబీ పథకం గడువు పూర్తి కావడంతో సదరు పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. దీని స్థానంలో యుఐడీఎఫ్ పథకం అమల్లోకి తీసుకొచ్చింది. ఈ పథకంలో కూడా 70 శాతం రుణం.. 30 శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటా ధనంగా నిధులు మంజూరు చేశారు.

పెరిగిన వ్యయం..

ఐదేళ్లుగా తాగునీటి పథకాల విస్తరణ పనులు నిలిచిపోవడంతో వ్యయం పెరిగింది. కొత్త రేట్ల ప్రకారం నీటి పథకాలకు వ్యయం అంచనాలను పబ్లిక్ హెల్త్ శాఖ రూపొందించింది. ఈ మేరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. నీటినిల్వ చెరువుల ఆధునికీకరణ, పైపులైన్ల నిర్మాణం, నీటి సరఫరాకు ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, నీటి శుద్ధి ప్లాంట్ల విస్తరణ వంటి పనులు చేపట్టనున్నారు. గృహాలకు నీటి సరఫరా కోసం డిస్ట్రిబ్యూషన్ లైన్లను నిర్మిస్తారు. మాచర్లలో సుమారు రూ.55 కోట్లతో పనులు చేపట్టగా 10 శాతం లోపే పనులు పూర్తయ్యాయి. పిడుగురాళ్లలో రూ.102 కోట్లతో పనులు చేపట్టగా 20 శాతం కూడా పూర్తి కాలేదు. వినుకొండలో రూ.138 కోట్లతో చేపట్టిన పనులు ముందుకు సాగడంలేదు. ఇక్కడ కూడా 20 శాతం లోపే పూర్తయాయి. నిర్ధీత గడువులో పనులు పూర్తి చేయకపోవడంతో దాదాపు రూ.141 కోట్లుగా వ్యయం పెరగడం గమనార్హం. ఇదే పరిస్థితి గుంటూరు కార్పొరేషన్ సహా మంగళగిరి, తాడేపల్లి, అద్దంకి మున్సిపాల్టీల్లో నెలకొంది.

క్రీడాకారుల ప్రయోజనాలే రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యం

● శాప్ చైర్మన్ రవినాయుడు

తాడేపల్లి(కొలనుకొండ), మార్చి 1(ఆంధ్రజ్యోతి): క్రీడాకారుల ప్రయోజనాలే రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. క్రీడాకారుల భవిష్యత్తే లక్ష్యంగా సీఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ రవినాయుడు వ్యాఖ్యానించారు. కాకినాడకు చెందిన జాతీయ క్రీడాకారిణి ఎస్కే యాసిన్ కొలనుకొండలోని శాప్ చైర్మన్ క్యాంప్ కార్యాలయంలో రవినాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యాసిన్ మాట్లాడుతూ ఉత్తరాఖండ్ వేదికగా జనవరి 28 నుండి ఫిబ్రవరి 14 వరకు జరిగిన 38వ జాతీయ క్రీడల్లో జిమ్నాస్టిక్స్‌లో భాగంగా ట్రాంపోలిన్ వ్యక్తిగత విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించినట్టు తెలిపారు. ఆమె సాధించిన పతకాలు, విజయాలను తెలియజేశారు. పోటీల్లో పాల్గొనే క్రమంలో యూనివర్సిటీ అటెండెన్స్ విషయంలో ఎదురవుతున్న ఇబ్బందిని వివరించగా పరిష్కారం దిశగా శాప్ చైర్మన్ రవినాయుడు స్పందించారు. అనంతరం ఆమెను అభినందిస్తూ భవిష్యత్తులో మరింత రాణించి ఉన్నత శిఖరాలు అందుకోవాలని క్రీడా వసతులు, ప్రోత్సాహకాల పరంగా శాప్ నుండి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని రవినాయుడు హామీ ఇచ్చారు.

జాతీయ క్రీడాకారిణి ఎస్‌కే యాసిన్‌తో మాట్లాడుతున్న శాప్ చైర్మన్ రవినాయుడు



డేటా సమగ్రంగా ఉండాలి

● మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు

గుంటూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో వివిధ జిల్లాల నుంచి వచ్చి మిరపకాయలను విక్రయిస్తున్న రైతుల డేటా సమగ్రంగా కమీషన్ వ్యాపారస్తుల వద్ద అందుబాటులో ఉండాలని మార్కెటింగ్ విజయవాడ రీజియన్ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు ఆదేశించారు. శనివారం మధ్యాహ్నం మిర్చియార్డు పరిపాలన భవనంలో ఆయన కమీషన్ వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ఏడాది డిసెంబరు ఒకటో తేదీ నుంచి మిర్చి విక్రయాలకు సంబంధించిన రైతుల వివరాలు మార్కెట్ కమిటీకి సాధ్యమైనంత త్వరగా నివేదించాలన్నారు. అందులో రైతుల పేర్లు, ఆధార్ నంబర్లు, బ్యాంకు అకౌంట్స్, ఏ ట్రేడర్ వాళ్ల మిర్చిని కొనుగోలు చేసింది, ఎంత మోతాదులో అమ్మకం చేశారు వంటి వివరాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ డేటా మొత్తాన్ని త్వరలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగే సమావేశంలో నివేదించాల్సి ఉందన్నారు. రైతుల ఈ-క్రాప్ బుకింగ్ వివరాలు కూడా సేకరించాలన్నారు. అలానే యార్డులో సమీకృత ఎలక్ట్రానిక్ కాటాల ఏర్పాటుకు సంబంధించి ఒక టీంని త్వరలోనే ఖమ్మం మార్కెట్ కమిటీకి పంపిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి హాజరైన మిర్చి కమీషన్ ఏజంట్లు మాట్లాడుతూ ఇప్పటికిప్పుడు డిసెంబరు నుంచి రైతుల వివరాలు ఇవ్వాలంటే చాలా కష్టమన్నారు. మార్చి 1వ తేదీ నుంచి ప్రభుత్వం నిర్దేశించిన నమూన ప్రకారం వివరాలు తెలియజేయగలమని చెప్పారు. సమావేశంలో మార్కెటింగ్ ఏడీ బి.రాజబాబు, మిర్చియార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక, యార్డు ఇన్‌చార్జ్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మార్కెటింగ్ జేడీ శ్రీనివాసరావు, ఏడీ రాజబాబు, సెక్రెటరీ చంద్రిక, హాజరైన వ్యాపారులు

వెటర్నరీ విద్యార్థులపై వివక్ష

● ఎంబీబీఎస్ విద్యార్థుల స్టైఫండ్ నెలకు రూ.25,906

● ఆయుర్వేదం, బీడీఎస్ చదివేవారికి అంతే మొత్తం సహాయం

● వెటర్నరీ విద్యార్థులకు ఇచ్చేది రూ.7 వేలే

● 13 ఏళ్లుగా ఒకటే వేతనం

● పక్క రాష్ట్రాలతో పోల్చినా ఇక్కడ ఇస్తుంది చాలా తక్కువే



గుంటూరులోని పాలీ క్లినిక్‌లో కుక్కకు వైద్యసేవలు అందిస్తున్న హౌస్ సర్జన్లు

గుంటూరు సిటీ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్ చదివిన వాళ్ళు మనుషులకు వైద్యం చేస్తే.. వెటర్నరీ సైన్సు చదివిన వాళ్ళు పశువులకు వైద్యం చేస్తారు. కోర్సు వ్యవధి.. హౌస్ సర్జన్ కాలపరిమితి ఇద్దరికీ సమానమే. చెప్పుకోవాల్సిన సంగతి ఏమిటంటే మనుషులకు వైద్యం చేసే కన్నా.. నోరు లేని పశువులకు వైద్యం చేయడమే ప్రమాదకరమైనది. హౌస్‌సర్జన్ చేసే కాలంలోనే జంతువుల నుంచి వ్యాప్తి చెందే అత్యంత ప్రమాదకరమైన రోగాలైన ర్యాబీస్, లెప్టో స్పైరా, బ్రూసెల్లోసిస్, ఆంత్రాక్స్ విద్యార్థులకు సోకుతూ ఉంటాయి. ఆ క్రమంలోనే కరీష్మా అనే విద్యార్థిని లెప్టో స్పైరా అనే వ్యాధి సోకి(ఎలుక మూత్రం వల్ల సోకే ఈ వ్యాధి వల్ల మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్) ఈ మధ్య కాలంలో మృతి చెందారు. అటువంటి ప్రమాదకరమైన పరిస్థితిలోనూ హౌస్ సర్జన్ చేస్తున్న వెటర్నరీ సైన్సు విద్యార్థులకు ఇచ్చే స్టైఫండ్‌లో ప్రభుత్వాలు చిన్న చూపు చూస్తున్నాయి. ఎంబీబీఎస్ చదివే విద్యార్థులకు నెలకు రూ.25,906 స్టైఫండ్‌గా ఇస్తుంటే, వెటర్నరీ సైన్సు అండ్ యానిమల్ హస్బెండరీ విద్యార్థులకు మాత్రం నెలకు రూ.7 వేలు మాత్రమే చెల్లిస్తున్నారు.

2013 నుంచి అంతే....

ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పాలీక్లినిక్‌ల్లో వెటర్నరీ సైన్సు చదివిన హౌస్ సర్జన్లు మాత్రమే పశువులకు వైద్యసేవలు చేస్తున్నారు. గుంటూరు వంటి నగరాల్లో రోజుకు కనీసం 300 పైగా ఓపీ వస్తుండగా, జంతు ఆరోగ్య సంరక్షణలో హౌస్‌సర్జన్ల పాత్ర కీలకమైనదని పశుసంవర్థక శాఖ అధికారులు చెబుతున్నారు. వాళ్ళు లేకపోతే పాలీక్లినిక్‌లు నడపడం కష్టం అంటున్నారు. నిజానికి 2013లో ఎంబీబీఎస్, వెటర్నరీ సైన్సు, బీడీఎస్, బీఏ ఎంఎస్ చదివే విద్యార్థులకు రూ.7వేలు మాత్రమే స్టైఫండ్ ఇచ్చేవారు. ఆ తర్వాత మిగిలిన వారి స్టైఫండ్‌ను రూ.25,906కు పెంచారు. కానీ వెటర్నరీ విద్యార్థులను మాత్రం మర్చిపోయారు. వాస్తవానికి ఇంటర్‌లో బైపీసీ తీసుకున్న ప్రతి విద్యార్థి ఎంబీబీఎస్ చదవాలని కలలు కంటారు. అది సాధ్యం కాకపోతే కనీసం వెటర్నరీ సైన్సు సీటు వస్తే బాగుండు అనుకుంటారు. డిమాండ్ ఉన్న ఈ రెండు కోర్సులకు మెరిట్ కలిగిన విద్యార్థులు పోటీ పడుతుంటారు. ఆ తర్వాతే హోమియో, ఆయుర్వేదం, బీడీఎస్ వంటి కోర్సులకు వెళ్తా రు. ప్రతిభ కలిగిన తమను పక్కన పెట్టేసి హోమి యో, ఆయుర్వేదం, బీడీఎస్ విద్యార్థులకు స్టైఫండ్ ఎక్కువగా ఇస్తున్నారని బాధితులు చెబుతున్నారు. గుంటూరులోని లాంలో ఉన్న శ్రీవెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ పరిధిలోని తిరుపతి, గన్నవరం, ప్రొద్దుటూరు, గరివిడి పశు వైద్య కళాశాలల నుంచి ప్రతి ఏటా కేవలం 200 మంది విద్యార్థులు హౌస్‌సర్జన్‌లుగా బయటకు వస్తున్నారు. వాళ్ల కాకుండా మరో 220 మం ది విద్యార్థులు పీజీ, పీహెచ్‌డీ చేసే వారున్నారు. గత ప్రభుత్వంలో ఈ విద్యార్థులు స్టైఫండ్ పెంపు కోసం ఉద్యమం చేశారు. అప్పటి మంత్రి సీదిరి అప్పలరాజు స్టైఫండ్ రూ.21 వేలు చేస్తే ప్రభుత్వం మీద పడే భారం ఏటా కేవలం రూ.12కోట్లేగా ఇబ్బంది ఏమిలేదు పెంచేస్తామని హామీ ఇచ్చి తప్పారని విద్యార్థులు చెబుతున్నారు. రాజస్థాన్‌లో వెటర్నరీ హౌస్‌సర్జన్ విద్యార్థులకు రూ.24వేలు, ఉత్తరప్రదేశ్‌లో రూ.23,500, పశ్చిమబెంగాల్‌లో రూ.20 వేలు, కేరళలో రూ.20వేలు, హర్యానాలో రూ.17వేలు, తమిళనాడులో రూ.14వేలు స్టైఫండ్ ఇస్తున్నట్లు బాధితులు చెబుతున్నారు.

రోజుకు రూ.263 మాత్రమే పడుతుంది..



ఈ రోజు రాష్ట్రంలో నైపుణ్యం లేని వ్యక్తికి కూలి రూ.500 వరకు చెల్లిస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో రూ.400వరకు ఇస్తున్నారు. మాకు మాత్రం ప్రస్తుత స్టైఫండ్ ప్రకారం వచ్చేది రోజుకు రూ.263 మాత్రమే. ప్రభుత్వం మా సమస్యను అర్థం చేసుకుని న్యాయం చేయాలి. ఒకటి రెండు మార్కుల తేడాతో మాత్రమే మేము మెడిసిన్ సీట్లు కోల్పోయాం. నోరు లేని మూగజీవాలకు సేవ చేయాలని ఈ కోర్సు చదివాం. ఇందులో చాలా ఇబ్బందులు ఉన్నాయి. ప్రాణాలు పోయే పరిస్థితి కూడా ఉంది.

- భాగం దత్తాత్రేయ, హౌస్ సర్జన్

జంతువులకు వైద్యం ఈజీ కాదు



మా దగ్గరకు చాలా ప్రమాదకరమైన జంతువులు వస్తుంటాయి. ఏ చిన్న పొరపాటు జరిగినా అవి మా మీద దాడి చేస్తాయి. జంతువులకు వైద్యం చేయడం చాలా కష్టం. ఒక్కోసారి అనేక రోగాలు వ్యాప్తి చెందుతాయి. అయినా ఈ వృత్తిని ఎంచుకోవటం సాహసమే. ప్రభుత్వం స్టైఫండ్ విషయంలో మాపై జాలి చూపాలి.

- దేవర రేవతి, హౌస్ సర్జన్

మేము చదివింది అవే సబ్జెక్టులు



ఎంబీబీఎస్ వాళ్ళు ఏ సబ్జెక్టులు అయితే చదువుతారో మాకు అవే ఉంటాయి. కాకపోతే వాళ్ళు మనుషులను బాగు చేస్తారు. మేం పశువులను బాగు చేస్తాం. మాకు స్టైఫండ్ ఇచ్చే విషయంలో చాలా చిన్నచూపు చూస్తున్నారు. మేం ఉన్నది చాలా తక్కువ మందిమి. ప్రభుత్వం ఇకనైనా మాకు స్టైఫండ్ పెంచేలా ఉత్తర్వులు జారీ చేయాలి.

- తాడికొండ చంద్రిక, హౌస్ సర్జన్

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

పశ్చిమ డెల్టాకాల్వకు 1216 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 1216 క్యూసెక్కుల సాగునీటిని శనివారం విడుదల చేసినట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.7 అడుగుల నీటి మట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లెకాల్వకు 148 క్యూసెక్కులనీరు, తూర్పుకాల్వకు 126, పశ్చిమకాల్వకు 125, నిజాంపట్నంకాల్వకు 60, కొమ్మమూరుకాల్వకు 482 క్యూసెక్కుల నీరు, విడుదల చేస్తున్నారు.

నూతన వాహన చట్టంపై అవగాహన

● జరిమానాల వివరాలతో బోర్డు



జరిమానాల వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ నారాయణ

తాడేపల్లి టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 1వ తేదీ నుంచి ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని లేకుంటే నూతన వాహన చట్టం ప్రకారం జరిమానాలు తప్పవని తాడేపల్లి ఎస్ఐ నారాయణ అన్నారు. నూతన వాహన చట్ట నిబంధనలు, జరిమానాలు తెలిపే విధంగా ప్రచార బోర్డులను ప్రకాశం బ్యారేజీ, కనకదుర్గమ్మ వారధి, ఉండవల్లి కూడలి, తదితర ప్రధాన ప్రాంతాల్లో శనివారం ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ నిబంధనలు కఠినతరంగా అమలు చేయడానికి జరిమానాలు భారీగా పెరిగాయని వాహన చోదకులు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ కోరారు. అలాగే సీఐ కళ్యాణ్‌రాజు ఆదేశాల మేరకు పలు ఆటో స్టాండ్‌ల వద్ద ఆటో డ్రైవర్లకు వాహన చట్టంపై అవగాహన కల్పించారు.

విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి : ఎంఈవో

కాకుమాను(పాండ్రపాడు), మార్చి 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాశాఖాధికారి కేఎఫ్ కెన్నడీ అన్నారు.మండల పరిధిలోని పాండ్రపాడు ప్రాథమికోన్నత పాఠశాలను శనివారం వార్షిక తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు, రికార్డులు, పఠనా సామర్థ్యాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్య పెరిగితే పాఠశాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా రూపాంతరం చెందుతుందని స్థానికులకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వాలతో పాటు స్థానికులు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఎఆర్పీలు జమాయమ్మ, చలపతిరావు, సురేంద్ర, రిసోర్స్ పర్సన్ అలీంఖాన్, హెచ్ఎం నాగమల్లేశ్వరి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విశ్వంజీ జన్మదిన వేడుకలు



విఘ్నేశ్వరుడికి అభిషేకం చేస్తున్న విశ్వయోగి విశ్వంజీ


ప్రత్తిపాడు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): విశ్వగురు పీఠాధిపతి విశ్వయోగి విశ్వంజీ 81వ జన్మదిన వేడుకల్లో మండల పరిధిలోని చిన కొండ్రుపాడు విశ్వనగర్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమాల్లో తొలి రోజు ఆశ్రమంలోని విగ్రహాలకు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. 108 కలశములతో కల్పవృక్ష వరసిద్ధి వినాయకుడికి విశ్వయోగి విశ్వంజీ అభిషేకం నిర్వహించారు. అనంతరం హారతి, మహానైవేద్యం కార్యక్రమాలు కనుల పండువలా జరిగాయి.

నేటి నుంచి రంజాన్ ఉపవాస ప్రార్థనలు ప్రారంభం

దుగ్గిరాల, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలో పలుగ్రామాల్లోని మసీదులు, ముస్లిం ప్రార్థనా మందిరాల్లో పవిత్ర రంజాన్ ఉపవాస ప్రార్థనలు శనివారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. నెలవంకను చూసిన అనంతరం ముస్లింసోదరులు మసీదుల్లోకి తరలి వచ్చి ప్రార్థనలు చేశారు. ముందుగా పరస్పరం ఆలింగనం చేసుకుని కఠోరదీక్షతో నెలరోజులు ఉపవాసదీక్షకు ఉపక్రమించారు. మసీదులకు చేరుకుని, ముస్లిం సంప్రదాయ పద్ధతిలో నమాజు చేశారు.

ఇంటర్ పరీక్షలకు 228 మంది హాజరు

తాడేపల్లి టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా శనివారం ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి తాడేపల్లి మండలం పెనుమాక జూనియర్ కళాశాలలో 230 మంది విద్యార్థులకు గాను 228 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఇద్దరు గైరుహాజరయ్యారు. సిట్టింగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారన్నారు



ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన మాదిగ అమరవీరులకు నివాళి కార్యక్రమం ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం సాయంత్రం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు నతాని యేలుమాదిగ, తరుణ్‌మాదిగ, సాంబయ్య మాదిగ, రవిమాదిగ, వీరయ్యమాదిగ తదితరులు దుగ్గిరాలలో బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద, మాదిగ అమరవీరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. **(దుగ్గిరాల, ఆంధ్రజ్యోతి)**

అన్నదాతల కల సాకారం చేసిన చంద్రబాబు

● కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

● చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే బూర్ల , మాజీ మంత్రి మాకినేని

ప్రత్తిపాడు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అర్ధశతాబ్దపు అన్నదాత కలను సాకారం చేసిన వ్యక్తి చంద్రబాబునాయుడు అని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు ఛానల్ పొడిగింపునకు వంద కోట్లు బడ్జెట్‌లో ప్రవేశ పెట్టడంపై హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్తిపాడులోని నిమ్మగడ్డవారిపాలెం సెంటర్లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని రైతుల సమక్షంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, మాజీ మంత్రి డాక్టర్ మాకినేని పెదరత్తయ్యలు చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే గుంటూరు చానల్‌కు నిధులు కేటాయించారన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత గుంటూరు ఛానల్ అంశాన్ని పూర్తి పక్కన పెట్టారన్నారు. ఆనాడే ఈ ఛానల్‌ను పూర్తి చేసి ఉంటే కేవలం రెండు వందల కోట్లతోనే పూర్తయ్యేదని, కాని ఈనాడు ఆ వ్యయం పెరిగిపోయిందన్నారు. గుంటూరు ఛానల్ పొడిగింపు విషయంలో తనతో పాటు ఎమ్మెల్యే రామాంజనేయులు ఎంతో కృషి చేశారన్నారు. వచ్చే రెండు, మూడు సంవత్సరాల్లో పనులు పూర్తయ్యే విధంగా అన్ని విధాలా చర్యలు తీసుకుంటామన్నారు. అంతేగాక ఆధునీకరణ కూడా చేపట్టేందుకు మరో 600 కోట్లు అవసరం ఉందని, వాటి కోసం కూడా కృషి చేస్తామన్నారు. మేము మాటలు చెప్పవని చేసి చూపించి తీరుతామన్నారు. రైతు కోసం పనిచేసే ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని మిర్చి రైతుకు గిట్టుబాటు ధర కోసం కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి 11వేలు ఇప్పించారన్నారు. నాడు రైతు సమస్యలను పట్టించుకోని జగన్ నేడు మిర్చి యార్డుకు వచ్చి కబుర్లు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేంద్రం నుంచి గ్రామీణ సడక్ యోజక కింద రాష్ట్రంలో 80 కిలోమీటర్లు మేర శాంక్షన్ చేయించుకున్నామన్నారు. అందులో బాగంగానే నియోజకవర్గానికి 20 కోట్లు కేటాయించామన్నారు, ఈదులపాలెం నుంచి తిక్కిరెడ్డిపాలెం వరకు పది కోట్లు, మట్లూరు నుంచి బురదపల్లి వరకు 11.50 కోట్లు, చిలకలూరిపేట నుంచి పెదనందిపాడుకు ఐదు కోట్లు మంజూరయ్యాయన్నారు. ఇవి కేంద్రం పవన్ కల్యాణ్ నిధుల నుంచి ఐదు కోట్లు నిధులు ప్రత్తిపాడు నియోజకవర్గానికి మంజూరు అయ్యాయన్నారు.

ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం గుంటూరు ఛానల్‌కు నిధులు మంజూరు చేసిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ మాకినేని పెదరత్తయ్య, రాష్ట్ర తెలుగురైతు మీడియా కోఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు, జనసేన సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు, వందనాదేవి, బీజేపీ నాయకుడు దేవరాజు, గింజుపల్లి శివరామప్రసాద్ అన్ని గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతకు తీవ్ర అన్యాయం

● ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు

మంగళగిరి సిటీ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతకు తీరని అన్యాయం జరిగిందని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు అన్నారు. మంగళగిరిలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత బడ్జెట్‌లో కేటాయించిన నిధులు ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదని, మళ్లీ అదే పద్ధతిలో నిధులు చూపించారని విమర్శించారు. చేనేతకు సంబంధం లేని యూనిట్‌కు గతంలో రూ.86 కోట్లు చూపించారని, ఇప్పుడు కూడా అదే యూనిట్‌కు రూ.66 కోట్లు కేటాయించారని తెలిపారు. వ్యవసాయం తర్వాత అతి పెద్ద రంగంగా ఉన్న చేనేత పరిశ్రమకు కేవలం రూ.115 కోట్లు మాత్రమే కేటాయించి అవమాన పరిచారని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వం 81 వేల 700 మందికి నేతన్న నేస్తం కింద ఏటా రూ.24 వేలు ఇచ్చిందని, ఆ పథకాన్ని కూడా కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేత కార్మికులకు అనేక వాగ్దానాలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని, ఇప్పటికైనా బడ్జెట్‌పై పునరాలోచించి చేనేతకు రూ.రెండు వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నేతలు గుజవల్లి వెంకటకృష్ణ, దొడ్డి ఈశ్వరరావు, ఏఐటీయూసీ నేత అన్నవరపు ప్రభాకర్‌రావు పాల్గొన్నా రు.

చేనేతను నిర్వీర్యం చేసే బడ్జెట్

● కే.శివదుర్గారావు, పిల్లలమర్రి బాలకృష్ణ

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ చేనేత రంగాన్ని నిర్వీర్యం చేసే విధంగా ఉందని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే శివదుర్గారావు, పిల్లలమర్రి బాలకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత బడ్జెట్‌లో చేనేత సహకార సంఘాలకు, చేనేత కార్మికులకు ఇవ్వవలసిన త్రిఫ్ట్ ఫండ్ కోసం రూ.5 కోట్లు కేటాయించారని, నిధులు విడుదల చేసి కూడా చేనేత కార్మికులకు ఇవ్వలేదని చెప్పారు. ప్రస్తుత బడ్జెట్‌లో సహకార సంఘాలకు ఇవ్వవలసిన యార్న్ సబ్సిడీ, పావలా వడ్డీ, రిబేటు పథకం కింద రూ.156 కోట్ల బకాయిలకు నిధులు కేటాయించలేదని విమర్శించారు. ప్రభుత్వ విధానాలతో చేనేత రంగం పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయి కార్మికులు ఆత్మహత్యలు, ఆకలిచావులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రాథమిక పాఠశాలల బలోపేతంతోనే విద్యారంగాన్ని కాపాడుకోగలం

దుగ్గిరాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయడం ద్వారానే విద్యారంగాన్ని కాపాడుకోగలమని, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ వెంకటేశ్వర్లు అన్నారు. యూటీఎఫ్ ముఖ్యకార్యకర్తల సమావేశం దుగ్గిరాలలో శనివారం సాయంత్రం నిర్వహించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గతప్రభుత్వం జీవో నెం.117తో ప్రాథమిక పాఠశాల వ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం పాత ప్రభుత్వం యిచ్చిన 50కంటే ఎక్కువ మంది విద్యార్థులన్న మోడల్‌ప్రైమరీ పాఠశాలలుగా మార్చాలని, మిగిలిన వాటిని యధాతథంగా కొనసాగించాలని అన్నారు. జీవోను రద్దు చేయాలన్నారు. ఉర్దూ మీడియం పాఠశాలలకు రంజాన్ సందర్భంగా ఒంటి పూట బడుల కొనసాగిస్తూ జీవో ఇవ్వాలని కోరారు. జిల్లా యూటీఎఫ్ కోశాధికారి ఎండీ గయాసుద్దీలా, కామాక్షి, చలపతిరావు, వీవీ సతీష్ బాబు, ప్రభాకరరావు పాల్గొన్నారు.

తడి, పొడిచెత్త నిర్వహణపై ప్రజలకు అవగాహన

దుగ్గిరాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తడి పొడి చెత్తలను వేర్వేరుగా చెత్త బుట్టల్లో వేసి, పారిశుధ్య సిబ్బందికి అందించాలని తెనాలి డీఎల్‌పీవో స్వరూపరాణి అన్నారు. గ్రామంలో పారిశుధ్యం మెరుగుపరిచే కార్యక్రమంలో భాగంగా దుగ్గిరాలలో రెండోవారం ప్రత్యేకడ్రైవ్‌ను శనివారం నిర్వహించారు. డీఎల్‌పీవో మాట్లాడుతూ ఆకుపచ్చరంగు డస్ట్‌బిన్‌లో తడిచెత్త, ప్లాస్టిక్ సామగ్రిని నీలిరంగు డస్ట్‌బిన్‌లోనూ, ఎరుపురంగు డస్ట్‌బిన్‌లో హానికరమైన చెత్తను వేసి ప్రతి రోజూ ఉదయాన్నే తమ యింటికి వచ్చే పారిశుధ్య సిబ్బందికి అందించాలన్నారు. సేకరించిన చెత్తను సంపద కేంద్రాలకు తరలించి, వర్మీకంపోస్టును తయారు చేసి ప్రజలకు అతితక్కువ ధరకు అందిస్తామన్నారు. ఈవో పీఆర్డీ జవహర్, పంచాయతీ కార్యదర్శి కె. వివేకానంద, ఉన్నం రాజేశ్, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

అరవింద హైస్కూల్లో అకడమిక్ డెమో

తాడేపల్లి (కుంచనపల్లి), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సంవత్సరం అంతా విద్యార్థులు ఏమి నేర్చుకున్నారో తల్లిదండ్రులకు తెలియజేయడానికి ఏర్పాటు చేసిన అకడమిక్ డెమోను పలువురు సందర్శించారు. ప్రీ ప్రైమరీ, ప్రైమరీ విద్యార్థులకు అన్ని సబ్జెక్టులకు సంబంధించిన కృత్యాలను, పజిల్స్ ఆటల రూపంలో ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కుంచనపల్లి అరవింద హైస్కూల్లో ఏర్పాటు చేసిన డెమోకు విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి వచ్చి తాము రూపొందించిన కార్యక్రమాలు చూపించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా వచ్చిన ప్రముఖ గైనికాలజిస్టు డాక్టర్ విజయలక్ష్మి, సెకండరీ తరగతుల విద్యార్థులకు నెలసరి వచ్చే మార్పుల గురించి వివరించారు. ఈ వయస్సులో ఆడపిల్లలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, ఆరోగ్య విషయాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇంద్రాణి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యార్థులకు సేంద్రియ సాగుపై అవగాహన



విద్యార్థులకు ఘన జీవామృతాలను పొడి చేసే యంత్రం పని తీరును వివరిస్తున్న ఫౌండేషన్ ఈసీవో సాంబశివరావు

వట్టిచెరుకూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : రసాయనిక రహిత వ్యవసాయానిదే భవిష్యత్తు అని సేంద్రియ రైతు మీసాల రామకృష్ణ అన్నారు. మండలంలోని పుల్లడిగుంట సమీపంలోని రైతు నేస్తం ఫౌండేషన్ ఆవరణలో శనివారం సేంద్రీయ సాగు, విలువ జోడింపుపై జరిగిన అవగాహన సదస్సులో నంది వెలుగు సేంద్రియ రైతు మీసాల రామకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు క్షేత్ర స్థాయిలో వ్యవసాయ సాగుపై అవగాహన కల్పిస్తూ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ ఫౌండేషన్ ఫర్ సైన్స్ టెక్నాలజీ అండ్ రీసెర్చ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పంటల సాగులో విచాక్షణ రహితంగా రసాయనాలు వినియోగించటం వల్ల నేల, నీరు, ఆహారం, వాతావరణం కలుషితమవ్వటంతో రసాయనిక వ్యవసాయం, ఎంతగానో అనర్థాలకు కారణమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రసాయనిక రహిత వ్యవసాయమే శ్రేయస్సు అని నిపుణులు, అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రభుత్వాలు సూచిస్తున్నాయన్నారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతులు తెలుసుకోవటం ముఖ్యమన్నారు. అవగాహన కార్యక్రమంలో విజ్ఞాన్ ఫౌండేషన్ ఫర్ సైన్స్ టెక్నాలజీ అండ్ రీసెర్చ్ కళాశాల విద్యార్థినులతో పాటు విజ్ఞాన్ విశ్వవిద్యాలయాల ఫ్యాకలీలు డాక్టర్ సుస్మిత, డాక్టర్ అరుణ కుమారి, యూసెఫ్, ఉమామహేశ్వరి, అమృత వర్షిణి, రైతునేస్తం ఫౌండేషన్ సీఈవో సాంబశివరావు పాల్గొన్నారు.

ఆడపిల్లలతో పాటు మొక్కలనూ పెంచండి

● సీడీపీవో సుజాతాదేవి



తల్లులకు మొక్కలను అందజేస్తున్న సీడీపీవో సుజాతాదేవి, ఏసీడీపీవో విజయ నిర్మల

ప్రత్తిపాడు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలతో పాటు తల్లిదండ్రులు ఒక మొక్కను కూడా పెంచాలని ప్రత్తిపాడు ఐసీడీఎస్ సీడీపీవో సుజాతాదేవి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ప్రత్తిపాడులో ఆడపిల్లల జననాల వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ ఆడపిల్లలతో పాటు మొక్కను నాటి దానిని సంరక్షించినట్లయితే అది మనకు నీడను ఇవ్వడమే కాకుండా మంచి ఫలాలను కూడా ఇస్తుందన్నారు. ప్రతి ఆడపిల్లను చదివించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని తల్లిదండ్రులకు సూచించారు. మండలంలోని పలు గ్రామాలలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో ఏసీడీపీవో విజయ నిర్మల, సూపర్‌వైజర్స్ మాధవి, భారతి, ఏఎన్ఎం శ్యామల, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పశువులకు గాలి కుంటు టీకాలు తప్పనిసరి

● వట్టిచెరుకూరు పశు వైద్యాధికారి కోటేశ్వరి, డాక్టర్ శివశంకర్

వట్టిచెరుకూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : పశు పోషకులు రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని గాలి కుంటు వ్యాధులు ప్రబలకుండా ముందుగా ప్రభుత్వం నిర్దేశించిన విధంగా గాలి కుంటు వ్యాధి నివారణ ఇంజక్షన్‌లను విస్తృతంగా చేపట్టిన ట్టు డాక్టర్ కోటేశ్వరి, డాక్టర్ శివశంకర్‌లు వెల్లడించారు. వట్టిచెరుకూరులో డాక్టర్ కోటేశ్వరి, ముట్లూరు పశువైద్యాధికారి డాక్టర్ శివశంకర్, కాట్రపాడు వైద్యాధికారి డాక్టర్ భవ్య, ఆయా హాస్పిటల్ పరిధిలోని గ్రామాల్లో గాలి కుంటు టీకాలు వేయటం ప్రారంభించారు. గాలి కుంటు నివారణ టీకాలు ఈనెల 31వ తేదీ వరకు నిర్వహిస్తామని చెప్పారు.



నుదురుపాడులో పశువులకు టీకాలు వేస్తున్న పశు వైద్యాధికారి షేక్ పీర్ అహమ్మద్

ఫిరంగిపురం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : పశువులకు గాలి కుంటు వ్యాధి వచ్చే ముందు జాగ్రత్తలు తీసుకోగలిగితే నివారణ సాధ్యమని మండల పశు వైద్యాధికారి షేక్ పీర్ అహమ్మద్ శనివారం అన్నారు. పశువులకు పాల ఉత్పత్తి తగ్గినా ఎలాంటి అవలక్షణాలు ఏర్పడినా పశు వైద్యులకు సమాచారం ఇస్తే గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను వేయటం వల్ల వ్యాధిని నిరోధించ వచ్చని ఆయన తెలిపారు.

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంచేందుకు శిక్షణ

దుగ్గిరాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంచే విధంగా ఇన్ఫోసిస్ స్ప్రింగ్‌బోర్డు ప్రోగ్రాంలోని ప్రాథమిక అంశాలపై శిక్షణ యిస్తున్నామని ఇన్ఫోసిస్ సంస్థ ప్రతినిధి కార్తీక్ తెలిపారు. స్థానిక జడ్పీబాలురోన్నత పాఠశాలకు ఇన్ఫోసిస్ స్ప్రింగ్‌బోర్డు ప్రోగ్రాంను ప్రత్యేక వాహనంలో ఏర్పాటు చేశారు. మేక్‌అవర్‌ల్యాబ్స్‌ఆన్‌వీల్స్ ద్వారా తొలిబ్యాచ్ 20మందికి ఉచిత శిక్షణ ఇచ్చారు. కార్తీక్ మాట్లాడుతూ, 1వతరగతి నుంచి మాస్టర్ డిగ్రీ చేసిన వారి వరకూ ఎవరైనా తమ పేర్లను రిజిస్టర్ చేసుకుని, ప్రోగ్రాంలోని 5500కు పైబడి కోర్సులలో ఉచితంగా శిక్షణ పొందవచ్చునన్నారు. ప్రాధమిక నైపుణ్యం అవగాహన కల్పించేందుకు గంటన్నర పాటు బేసిక్ ఎలక్ట్రానిక్స్ గురించి ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్, ట్యాబ్స్‌తో విద్యార్థులచే స్వయంగా ప్రయత్నించేలా శిక్షణ కొనసాగించారు. భవిష్యత్‌లో రోబోటిక్స్ వైపు అడుగులు వేసేందుకుగానూ పైలెట్ ప్రాజెక్టు కింద మంగళగిరి నియోజకవర్గంలో పలు జడ్పీహైస్కూళ్లలో ఎనిమిది, తొమ్మిది తరగతుల విద్యార్థులకు శిక్షణ ప్రారంభించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ఎంఈఓ కాజ లక్ష్మీనారాయణ, ఇన్‌చార్జి హెచ్‌ఎం ఉమాదేవి, సైన్సు ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు నాగకుమారి, రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు

● శుభాకాంక్షలు తెలిపిన మంత్రి లోకేశ్

మంగళగిరి సిటీ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ మాసం ఆదివారం నుంచి ఆరంభం కానుంది. ఆకాశంలో నెలవంక దర్శనమివ్వడంతో ఆదివారం నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు ఆచరించేందుకు ముస్లింలు సన్నద్ధమవుతున్నారు. ఈ మేరకు మంగళగిరి అంజుమన్ - యి-హిమాతుల్ ఇస్లాం సంస్థ శనివారం సాయంత్రం అధికారికంగా ప్రకటించింది. రంజాన్ మాసం ప్రాంభానికి చిహ్నంగా మసీదుల్లో సైరన్ మోగించారు. ముస్లింలు నెల రోజులపాటు కఠోర ఉపవాస దీక్షలు ఆచరించనున్నారు. రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు. అల్లాహ్ దయతో క్రమశిక్షణ, శాంతి, సహనం, దాన గుణంతో ఉపవాస దీక్షలు విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. కాగా, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మహమ్మద్ ఇబ్రహీం శనివారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలియజేశారు.

బడ్జెట్‌లో మైనార్టీలకు ప్రాధాన్యం

● గుంటూరు జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి షేక్ రిజ్వానా

తాడికొండ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో మైనార్టీల అభివృద్ధికి నిధులు కేటాయించడంలో కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని మాజీ ఎంపీపీ, గుంటూరు జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి షేక్ రిజ్వాన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా బడ్జెట్‌లో మైనార్టీలు ఆర్థికంగా అభివృద్ధి చెందటానికి రూ.5434 కోట్లు భారీగా కేటాయించటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గత ఏడాది బడ్జెట్‌కన్నా రూ.1058 కోట్లు అదనంగా నిధులు మంజూరు చేశారన్నారు. గత ప్రభుత్వం మైనార్టీలకు అడుగడుగున మోసం చేసిందన్నారు. దుల్హన్ పథకాన్నిరద్దు చేసిందని, విదేశీ విద్యను గాలికి వదిలేసిందని, హజ్ యాత్రికులకు సబ్సిడీ రద్దు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగుదేశం ప్రభుత్వ కట్టించిన హజ్ హౌస్‌లను పూర్తి చేయకుండా అసాంఘీక కార్యాకలాపాలకు అడ్డాగా వైసీపీ ప్రభుత్వం మార్చిందన్నారు. ప్రసుత్త బడ్జెట్‌లో ప్రధానమంత్రి జనవికాస్ కార్యాక్రమం కోసం రూ.560 కోట్లు, ముస్లిం మైనార్టీల స్వయం ఉపాధి ఆర్థిక భరోసా కోసం రూ.173 కోట్లు, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఓవర్సెస్ పథకానికి రూ.20 కోట్లు, ఇమామ్ మౌజనులకు గౌరవ వేతనానికి రూ.90 కోట్లు, హజ్ యాత్రకు రూ.14 కోట్లు, ఉర్దూ అకాడమీకి రూ.10.80 కోట్లు కేటాయించారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయంలో నిర్మించి అసంపూర్తిగా ఉన్న షాదీఖానాలను పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించుకున్నదన్నారు. కూటమి ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీలకు స్వర్ణ యుగమన్నారు.

రవీంద్ర భారతిలో ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న ఉపాధ్యాయులు

మంగళగిరి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి రవీంద్ర భారతి విద్యాలయంలో శనివారం విద్యార్థులు ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. విద్యార్థులు స్వయంగా వివిధ నమూనాలను తయారు చేసి ప్రదర్శనలో ఉంచారు. మండల విద్యాశాఖాధికారి ఎన్.బాబు వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించి ప్రసంగించారు. విద్యార్థుల్లో ఊహాజనితమైన ఆలోచనలను మెరుగుపరిచేందుకు, మేధాశక్తికి పదును పెట్టేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం చేస్తాయని చెప్పారు. అంతేకాకుండా ప్రయోగాత్మక పరిశోధనలతో నూతన ఆవిష్కరణలకు నాంది పలికేందుకు ఆస్కారం ఏర్పడుతుందని తెలిపారు. కాగా, విద్యార్థులు రూపొందించిన సైన్సు వర్కింగ్ మోడల్స్ డీఎస్ఏ, ఆల్కహాల్ డిటెక్టర్, రోబోలు, అంతరిక్షం, విపత్తులకు కారణాలు, లిఫ్ట్ ఇరిగేషన్, ఖగోళం, గ్రహాలు, వాటి ఉనికి, పర్యావరణ పరిరక్షణ, భారతీయ సంస్కృతి వంటి అంశాలపై ఏర్పాటు చేసిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో రవీంద్ర భారతి విద్యాసంస్థల చైర్మన్ వీరమాచనేని వంశీకృష్ణ, అకడమిక్ డైరెక్టర్ శాంతి, ప్రిన్సిపాల్ వేమూరి డానియేల్, హెచ్‌వోడీ శివ, శారద, రమాదేవి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమానికి సంగం కృషి



చిన్నలింగాయపాలెంలో పాల రైతులకు బీమా పరిహారం అందజేస్తున్న డెయిరీ డైరెక్టర్లు

కాకుమాను(చిన్నలింగాయపాలెం), మార్చి 1: పాడి రైతుల సంక్షేమానికి సంగం డెయిరీ విశేష కృషి చేస్తుందని డెయిరీ డైరెక్టర్ గొల్లపూడి శ్రీనివాసరావు, దేవిరెడ్డి వెంకట సుబ్బయ్య అన్నారు. మండల పరిధిలోని చిన్నలింగాయపాలెం మిల్క్ ప్రొడ్యూసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో శనివారం గ్రామానికి చెందిన పాడి రైతు కంచర్ల ఆదియ్య ఇటీవల మృతి చెందాడు. ఆయన కుటుంబానికి డీవీసీ అభయ పథకం ద్వారా రూ.50 వేలు, మట్టి ఖర్చుల నిమిత్తం మరో పది వేలు నగదును మాజీ ఎంపీపీ కాకుమాను సింగారావుతో కలసి నామినీకి నగదును అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్‌లు మాట్లాడుతూ సంగం డెయిరీ పాడి రైతులకు, పశువులకు బీమా కల్పిస్తున్నది అన్నారు. డెయిరికి వచ్చిన లాభాలలో ఎక్కువ భాగం పాడి రైతుల సంక్షేమానికి పంచి పెడుతుందన్నారు. సంగం డెయిరీ చైర్మన్, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో సంగం డెయిరీ అభివృద్ధి పథంలో దూసుకువెళుతుందన్నారు. మాజీ ఎంపీపీ సింగారావు మాట్లాడుతూ రైతులకు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ వల్ల ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. వ్యవసాయం, పాడి రైతులకు రెండు కళ్లుగా అభివర్ణించారు. కార్యక్రమంలో బాపట్ల ఏరియా జోనల్ మేనేజర్ తెల్లప్రోలు వీరేంద్ర, రూట్ సూపర్‌వైజర్ గంగాధర్, స్థానిక పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధికి చికిత్స, మందులు అందిస్తున్నాం

● తెనాలి టీబీయూనిట్ సూపర్‌వైజర్ డాక్టర్ పల్లికొండ రవికుమార్



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న తెనాలి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ డాక్టర్ రవికుమార్

దుగ్గిరాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి, చికిత్స అందించి, ఉచితంగా మందులిస్తున్నామని తెనాలి టీబీయూనిట్ సూపర్‌వైజర్ డాక్టర్ పల్లికొండ రవికుమార్ అన్నారు. చిలువూరులోని యూనియన్ బ్యాంకు సమీపంలో జరిగిన క్షయవ్యాధి..నివారణ, చికిత్సపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ, రెండు వారాలకు పైబడి జ్వరంతోపాటు, దగ్గు తగ్గనట్లైతే క్షయవ్యాధిగా అనుమానించవచ్చునన్నారు. దగ్గుద్వారా వచ్చే కళ్లెఎరుపురంగా రక్తపుచారలు కనిపించినట్లైతే స్థానికంగా ఉన్న ఆశ కార్యకర్త లేదా పీహెచ్‌సీ వైద్యసిబ్బందిని కలిసి, తక్షణమే వైద్యపరీక్షలు జరిపించుకోవాలన్నారు. క్షయవ్యాధి బారిన పడిన వారికి కేంద్ర ప్రభుత్వం ఆరునెలలకుగానూ, రూ.6వేలు రోగిఖాతాలో జమచేస్తుందన్నారు. బ్యాంకు మేనేజర్ వరప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీ స్రవంతి, ఆశా కార్యకర్త సుజాత, నర్సింగ్ విద్యార్థిని టీ సిరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

రంజాన్ దీక్షలు దిగ్విజయంగా సాగాలి: ఎమ్మెల్యే ధూళిపాళ్ల

పొన్నూరు టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించే కఠోర ఉపవాస దీక్షలు దిగ్విజయంగా సాగాలని ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ శనివారం ఆకాంక్షించారు. నెలవంక దర్శనమిచ్చి పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైన సందర్భంగా ముస్లింలకు నరేంద్ర కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని మసీదుల వద్ద ప్రార్థనలకు తగిన ఏర్పాట్లు చేసేందుకు అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. క్రమశిక్షణ, శాంతి, సహనం, దాన గుణంతో సాగే కఠోర దీక్షలు దిగ్విజయంగా సాగి అల్లా అనుగ్రహం అందరూ పొందాలని ఎమ్మెల్యే నరేంద్రకుమార్ ఆకాంక్షించారు.

స్థల వివాదంలో కత్తితో దాడి

తెనాలి మారీసుపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్థల వివాదంలో ఏర్పడిన ఘర్షణలో కత్తితో దాడిచేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సుల్తానాబాదుకు చెందిన శివనాయక్‌కు తన తమ్ముడి కుమారుడు కార్తిక్‌నాయక్‌తో ఇంటి స్థలం విషయంలో గత కొంతకాలంగా వివాదం నడుస్తోంది. శుక్రవారం రాత్రి తిరిగి స్థల విషయంలో ఇరువురి మధ్య వివాదం జరిగింది. ఈ క్రమంలో కార్తిక్‌నాయక్ పెదనాన్న శివనాయక్‌పై కత్తితో దాడి చేయడంతో రక్తస్రావంతో పడిపోయాడు. కుటుంబ సభ్యులు గాయాలతో ఉన్న బాధితుడు శివనాయక్‌ను జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ శనివారం పోలీసులకు దాడిపై ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నలుగురు జూదరుల అరెస్టు

కొల్లిపర, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో శనివారం జూదరులపై దాడులు నిర్వహించగా చెముడుబాడుపాలెం పంట పొలాల్లో నలుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ కోటేశ్వరరావు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు ప్రకారం చెముడుబాడుపాలెం పంట పొలాల్లో నలుగురు జూదం ఆడుతున్నట్లు సమాచారం రావటంతో వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న రూ.16వేల420లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

నేత్ర వైద్య శిబిరం అభినందనీయం

● లెఫ్టినెంట్ కల్నల్ మహేష్

తెనాలి రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పేదలకోసం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించడం అభినందనీయమని లెఫ్టినెంట్ కల్నల్ జె.మహేష్ అన్నారు. శనివారం మండలంలోని కొలకలూరులో బాబూ జగ్జీవన్‌రామ్ రీడింగ్‌రూమ్‌లో డొనేట్‌ఫర్ పూర్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రేమ్ హాస్పటల్ సౌజన్యంతో నిర్వహించిన కంటి వైద్యశిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా ప్రారంభించారు. సంస్థ సభ్యులు ప్రభాకర్‌రాజు జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన కంటి శిబిరంలో డాక్టర్ మాధవీలత మాట్లాడుతూ షుగర్ వ్యాధిగ్రస్థులు కనీసం ఏడాదికి ఒకసారైనా కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. క్యాంపు ద్వారా రోగులకు ఉచితంగా పరీక్షలు జరిపి అవసరమైన వారికి కళ్లజోళ్లు, ఐడ్రాప్స్, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాకేష్, జి.రోహిత్, రాజ్‌కుమార్, వినయ్‌కుమార్, రవికిరణ్, ఎం.వేంకటేశ్వరరావు, మురళీధర్‌లు పర్యవేక్షించారు.

బడ్జెట్‌పై నాయీ బ్రాహ్మణుల హర్షం

తెనాలి అర్బన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ నాయీ బ్రాహ్మణ అభ్యున్నతికి దోహదపడుతుందని కార్పొరేషన్ డైరెక్టర్ కె.రఘురామయ్య హర్షం వ్యక్తం చేశారు. క్షౌరశాలలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిర్ణయం తీసుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు. వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఆదరణ పథకాన్ని కూడా పునరుద్ధరించేలా బడ్జెట్ ప్రకటించారని, దీనికి సంబంధించిన విధి విధానాలు అందిన వెంటనే ప్రతి ఒక్కరికీ తెలియజేస్తామన్నారు.

రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించండి: డాక్టర్ మజీదాబేగం

తెనాలి రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రికి అనారోగ్య సమస్యలతో వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యసేవలందించాలని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మజీదాబేగం అన్నారు. శనివారం పట్టణంలోని జిల్లా ప్రభుత్వవైద్యశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మజీదాబేగం మాట్లాడుతూ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. అనారోగ్యంతో వచ్చే రోగులకు తగిన గౌరవం ఇచ్చి సకాలంలో వైద్యసేవలు చేరువచేయాలన్నారు. ఆసుపత్రిలో వార్డుల్లో ఉండే రోగులకు ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. ఆసుపత్రిలో పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు చేపట్టాలని, ఆహారం అందించేందుకు సమయపాలన పాటించాలని సూచించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కరాటేలో సెయింట్ థామస్ విద్యార్థుల ప్రతిభ

పొన్నూరు టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) పొన్నూరు పట్టణంలోని సెయింట్ థామస్ కేరళ ఇంగ్లీషు మీడియం విద్యార్థులు కరాటే పోటీలలో అద్భుత ప్రతిభను చూపినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రోజ్‌థామస్ తెలిపారు. శనివారం పాఠశాలలో విద్యార్థుల అభినందన కార్యక్రమం జరిగింది. ఇటీవల చిలకలూరిపేటలో జరిగిన ఆల్ ఇండియా కరాటే-డో చాంపియన్ షిప్ 2025లో తమ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు చెప్పారు. ఎలోకే కునకోషి షోటొకన్ కరాటే డో అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగినట్లు చెప్పారు. చాంపియన్‌షిప్ మొదటి బహుమతిగా సౌమ్య, రెండో బహుమతిని లిలి శరణ్య, మూడో బహుమతి ప్రియాంక ఫర్హాన్, రయ్యాన్, జాహ్నవి, అచీవ్‌మెంట్ ట్రోఫీలో గెలుపొందినట్లు చెప్పారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం



పరీక్షా కేంద్రం వద్దకు చేరిన విద్యార్థులు, తల్లిదండ్రులు

తెనాలి అర్బన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. పరీక్షల నిర్వహణకు గాను పట్టణంలో 12 కేంద్రాలను ఇంటర్ బోర్డు ఏర్పాటు చేసింది. మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఆయా పరీక్షా కేంద్రాల వద్ద పెద్ద సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు ఉదయం చేరుకున్నారు. పిల్లలకు ధైర్యం చెప్పి పంపిస్తున్న తల్లిదండ్రులు వారిని బాగా రాయాలంటూ ఆశీర్వదిస్తూ కనిపించారు. పలు ఆలయాల్లో కూడా విద్యార్థులు పూజలు చేయించుకుని పరీక్షలకు బయలుదేరారు. పరీక్షా కేంద్రాల వద్ద సిబ్బంది, పోలీసులు విద్యార్థులను తనిఖీలుచేసి లోనికి అనుమతించారు. స్టేషన్ రోడ్డులోని వైష్ణవి జూనియర్ కళాశాల, ఎన్నారై కళాశాల, చైతన్య, నారాయణ, వివేక, జేఎంజే, స్నేహానికేతన్, ఎల్‌వీఆర్ విశ్వ జూనియర్ కళాశాలలను పరీక్షా కేంద్రాలుగా ఎంపికచేశారు. గుంటూరు ప్రాంతీయ కార్యాలయం అధికారులు పర్యవేక్షించారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 2950 మంది, రెండో సంవత్సరం విద్యార్థులు 3120 మంది పరీక్షలు రాస్తున్నారు.

పొన్నూరులో...

పొన్నూరు టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభం అయ్యాయి. పొన్నూరు పట్టణంలోని పీబీఎస్ కళాశాలలో 375మంది, సుజాత జూనియర్ కళాశాలలో 315, శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో 240మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. తొలిరోజు లాంగ్వేజ్ పరీక్ష ప్రశాంత వాతావరణంలో ప్రారంభం అయింది. ఉదయం 8గంటలకే పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు విచ్చేశారు. కేంద్రాల నిర్వాహకులు విద్యార్థులను తనిఖీలుచేసి పెన్నులు, పెన్సిల్, ప్యాడ్‌లు, ఇతర పరీక్ష సామగ్రి హాల్ టికెట్ తప్ప మరే వస్తు సామగ్రిని పరీక్ష కేంద్రంలోకి అనుమతించలేదు, పరీక్ష కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అర్బన్ పోలీసులు 144 సెక్షన్‌తో బందోబస్తు నిర్వహించారు.



పరీక్ష కేంద్రాల విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దుకుందాం

నందివెలుగులో డీపీవో నాగసాయికుమార్



నందివెలుగులో మహిళలకు స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తున్న డీపీవో నాగసాయికుమార్

తెనాలి రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామాలన్నింటిని పచ్చదనం పరిశుభ్రతలు కలిగిన స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దుకుందామని డీపీవో నాగసాయికుమార్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని నందివెలుగులో చేపట్టిన స్వచ్ఛత దినోత్సవ కార్యక్రమంలో డీపీవో నాగసాయికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామంలో స్వచ్ఛతపై ర్యాలీ నిర్వహించి గ్రామస్థులకు మూడు బుట్టల విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీపీవో నాగసాయికుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి గ్రామాన్ని స్వచ్ఛత వైపు నడిపించి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని స్వచ్ఛత దినోత్సవం పేరిట అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఏ గ్రామమైతే పరిశుభ్రతలతో పచ్చదనంతో నిండి ఉంటుందో ఆ గ్రామంలో ప్రశాంత వాతావరణంతోపాటు ఆరోగ్యవంతులుగా జీవించవచ్చన్నారు. ఇంటా, బయటా వచ్చే చెత్తను రోడ్లపై వేయకుండా మూడు బుట్టల విధానాన్ని పాటించాలన్నారు. తడిచెత్త, పొడిచెత్త, హానికరమైన వ్యర్థాలను ఈ మూడు బుట్టల విధానం ద్వారా నింపి ప్రతిరోజు పంచాయతీ నుంచి వచ్చే పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. ప్రజలందరి సహకారంతో స్వచ్ఛ గ్రామాల కళను సాకారం చేయగలమన్నారు. పంచాయతీ అధికారులు, సిబ్బందికి సహకరిస్తూ ఆరోగ్యకరమైన గ్రామంగా నందివెలుగును తీర్చిదిద్దేలా ప్రతిఒక్కరూ వారివంతు సహకారం అందించాలని కోరారు. అనంతరం చెత్తనుంచి సంపద సృష్టి కేంద్రాలను పరిశీలించి కంపోస్ట్ ఎరువు తయారీకి వానపాములను వదిలారు. చెత్త సంపద కేంద్రాలను అభివృద్ధి చేసే బాధ్యత పంచాయతీలపైనే ఉందన్నారు. వర్మీ కంపోస్టు తయారుచేసిన అనంతరం అవసరమైన వారికి విక్రయించడం ద్వారా పంచాయతీకి ఆదాయం వస్తుందని దానితో పలు అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించే అవకాశం ఉంటుందన్నారు. ఈవోపీఆర్డీ వైవీడీప్రసాద్ మాట్లాడుతూ మండలంలో ప్రతి గ్రామాన్ని స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళికతో ముందుకు పోతున్నామన్నారు. గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ ద్వారా పారిశుధ్య నిర్వహణ చేపట్టామని జిల్లాలోనే మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు పి.విజయలక్ష్మి గ్రామంలో మహిళలకు బొట్టుపెట్టి స్వచ్ఛగ్రామంగా తీర్చిదిద్దేందుకు మూడు బుట్టల విధానాన్ని పాటించాలని వినూత్నంగా ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ ధూళిపాళ్ల నాగపవన్‌కుమార్, కార్యదర్శి బండ్లమూడి హేమకుమారి, మండల కో ఆర్డినేటర్ దివ్య, పంచాయతీ సిబ్బంది, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై ఫిర్యాదులు వస్తే సహించేదిలేదు

● మునిసిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి మారీసుపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనుల నిర్వహణపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే సహించేదిలేదని మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న అన్నారు. శనివారం పట్టణంలోని పలు వార్డులలో జరుగుతున్న పారిశుధ్య పనులను క్షేత్రస్థాయిలో అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణాన్ని సుందర తెనాలిగా తీర్చిదిద్దేందుకు పురపాలక సంఘం పాటుబడుతోందన్నారు. అందులో భాగంగా ప్రతిరోజు వార్డుల్లో శానిటేషన్ పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఈ క్రమంలో పలు వార్డుల నుంచి శానిటేషన్ సమస్యలపై తమకు ఫిర్యాదులు అందుతున్నాయని కార్మికులు తమ విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. సంబంధిత శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా సక్రమంగా తమ విధులు నిర్వహించేలా బాధ్యతతో మెలగాలన్నారు. ఇకపై వార్డులలో ఆకస్మిక తనిఖీలు చేపడతానని శానిటేషన్ విభాగంలో వారికి కేటాయించిన పనుల్లో జాప్యం జరిగితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అనంతరం పట్టణంలోని పలు పార్కులలో పార్కుల నిర్వహణపై అమృతమిత్రా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ ఎంఈ ఆకుల శ్రీనివాసరావు, మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్తను జిందాల్ కంపెనీకి తరలించండి

తెనాలి మారీసుపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సేకరిస్తున్న చెత్తను జిందాల్ కంపెనీకి తరలించాలని పురపాలక సంఘ కమిషనర్ బండి శేషన్న మునిసిపల్ అధికారులను ఆదేశించారు. శనివారం పట్టణంలో పురపాలక సంఘ కార్యాలయంలోని మెప్మా షెడ్‌లో మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న శానిటరీ ఇన్‌స్పెకర్లు, శానిటరీ సెక్రటరీలు, పారిశుధ్య కార్మికులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ప్రతిరోజు సేకరించే చెత్త, వ్యర్థాలను వేరుచేసి జిందాల్ కంపెనీకి తరలించాలని సూచించారు. చెత్తను డంపింగ్ యార్డులో నిల్వ చేయవద్దని చెత్తను జిందాల్ కంపెనీకి తరలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మల, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సెక్రటరీలు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

మాదిగ అమరవీరులకు ఘన నివాళి



తెనాలిలో నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్, టీడీపీ ఎస్సీసెల్ నాయకులు

తెనాలి రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం చేసిన పోరాటంలో అమరులైన మాదిగ అమరవీరులను స్మరించుకుంటూ సంస్మరణ దినోత్సవాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని చెంచుపేట ఇందిరాకాలనీలో బీజేఆర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు చిలక కిరణ్‌కుమార్ మాదిగ, తంగిరాల,మనోజ్ టీడీపీ ఎస్సీసెల్ మాజీ జిల్లా అధ్యక్షుడు సొపాటి కిరణ్, బి.ప్రసాద్, కె. వెంకట్, గాజులవర్తి సురేష్, పినపాటి రత్నరాజు, అత్తోట ప్రసాద్, కొఠవరం సురేష్, గిరీష్, కృష్ణలు అమరులను సేవలను స్మరించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢసానుభూతిని తెలిపారు.

● మండలంలోని కొలకలూరులో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఉన్నం ధర్మారావు మాదిగ ఆధ్వర్యంలో మాదిగ అమరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మాదిగ అభివృద్ధి సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ కూచిపూడి మోహన్ మాదిగ, మండల అధ్యక్షుడు ఉన్నం సన్నీమాదిగ, దాసు మాదిగ, గోపి మాదిగ, ఆంథోని మాదిగ, ఇమ్మానియేలు మాదిగ, కిరణ్ మాదిగ, విక్కీ మాదిగ బల్లు మాదిగ పాల్గొన్నారు.

పొన్నూరులో...

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), మార్చి 1: ఉద్యమంలో అశువులు బాసిన మాదిగ అమరవీరుల ప్రాణ త్యాగ ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ సాధించామని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు మురికిపూడి హృదయరాజు అన్నారు. చేబ్రోలు డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద శనివారం ఎమ్మార్పీఎస్ అమరవీరుల నివాళి కార్యక్రమం జరిగింది. ఉద్యమంలో మృతిచెందిన అమరవీరులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డేగల బాబు, గురవయ్య, ఆదాము పాల్గొన్నారు.

వైద్యం కోసం ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ముస్లిం నాయకులు

పొన్నూరు టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్న మహిళకు ముస్లిం మైనార్టీ నాయకులు శనివారం ఆర్థికసాయం అందజేశారు. పట్టణంలోని 21వ వార్డుకు చెందిన షేక్ షకీరా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న సమాచారం తెలుసుకున్న ముబారక్‌నగర్ ఎంఎం యూత్ సభ్యులు రూ.10వేల ఆర్థికసాయాన్ని అంజుమన్ కమిటీ అధ్యక్షుడు మగ్బుల్ బేగ్, షేక్ సైఫుల్లా చేతుల మీదుగా షకీరా కుటుంబసభ్యులకు అందజేశారు. ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ మహ్మద్, ముల్లా నజరుద్దీన్, ఇస్మాయిల్, బాబ్జీ, హుస్సేన్, మునీర్, తదితరులు పాల్గొన్నారు.

పంటల మార్పిడి విధానాన్ని అనుసరించాలి: వెంకటలక్ష్మి

పొన్నూరు టౌన్ (చేబ్రోలు) మార్చి 1: పంటల మార్పిడి విధానాన్ని అనుసరించడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని లాం ఫాం ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎన్.వెంకటలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని నారాకోడూరులో శనివారం కంది పంటపై రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన డాక్టర్ వెంకటలక్ష్మి కంది పంటను పరిశీలించి పంట కోత అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పచ్చిరొట్ట పైర్ల వినియోగం, పంట మార్పిడి గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉద్యానవన అధికారి ఉష, రైతులు, ఉద్యాన శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఐబీ ఎక్స్‌పోలో పాల్గొన్న వివా ది స్కూల్ విద్యార్థులు, అధ్యాపకులు

వివా 'ఐబీ' విద్యార్థుల పీవైపీ ఎక్స్‌పో

పెదకాకాని, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వివా ది స్కూల్ ఇంటర్నేషనల్ బాకలారియేట్ ఏ.వై.ఏ (ప్రైమరీ ఇయర్స్ ప్రోగ్రామ్) చివరి సంవత్సరం (5వ తరగతి) విద్యార్థులు తరగతి గదిలో అభ్యసించిన అంశాలపై వారి అవగాహన, సృజనాత్మకత, నైపుణ్యాలను ప్రదర్శించేందుకు ఏర్పాటుచేసిన ప్రైమరీ ఇయర్స్ ప్రోగ్రామ్ ఎక్స్‌పో (పీవైపీఎక్స్) విశేషంగా ఆకట్టుకుంది. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు 'ఐబీ' విద్యావిధానం ద్వారా వారు అభ్యసించిన విద్యా, విద్యేతర అంశాలలో ప్రావీణ్యం సాధించిన నైపుణ్యాలను తల్లిదండ్రులు, ఉపాధ్యయుల సమక్షంలో ప్రదర్శించారు. షేరింగ్ ది ప్లానెట్ అంటూ ఉపాధ్యాయులు అందించిన నేపథ్య అంశంపై విద్యార్థులు వాతావరణ చర్య, నీటి సంరక్షణ, జంతు సంరక్షణ, ఆహారం-ఆకలి వంటి అంశాలపై రూపొందించిన నమూనాలు ఆకట్టుకున్నాయి. ఇటీవల కాలంలో విద్యార్థులు సందర్శించిన పర్యాటక ప్రాంతాలు, వాటి విశిష్టతను తెలియజేస్తూ రాసిన వ్యాసాలు, ఫొటోలు ఈ ప్రదర్శనలో ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమాన్ని సందర్శించిన తల్లిదండ్రులు విద్యార్థుల ప్రగతిని వీక్షించారు. అనంతరం ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులను ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎలిటి కమాండర్ కేఎస్ రావు, ప్రిన్సిపాల్ సీహెచ్ సరళ, ఐబీ సమన్వయకర్త కె.మాధవి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలే లక్ష్యం: నిరంజన్

పొన్నూరు టౌన్ (చేబ్రోలు) మార్చి 1 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద సృష్టించి స్వచ్ఛ గ్రామాలను సాధించడమే లక్ష్యమని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం అధికారి నిరంజన్ తెలిపారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై శనివారం మండల పరిధిలోని వేజెండ్ల, సుద్దపల్లి, శలపాడు, వీరనాయకునిపాలెం, శేకూరు, వడ్లమూడి గ్రామాలలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఇంటి నుంచి చెత్త సేకరణ, విధానాన్ని పరిశీలించారు. చెత్త సేకరణ పై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. అనంతరం సాలిడ్‌వేస్టు ప్లాంట్‌లను పరిశీలించి వానపాముల ఎరువుల తయారీని తనిఖీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శరణు వేణుగోపాలరావు, సుభాష్ చంద్రబోస్, ప్రశాంతి, శ్రీలత, శ్రీనివాసరావు, సృజన పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జీవనలత, నిర్వాహక సభ్యులు

4న తెనాలిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

తెనాలి రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రెయిన్‌బో ట్రస్ట్ తెనాలి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఈ నెల 4న సందడిగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకురాలు డాక్టర్ జీవనలత చెప్పారు. శనివారం పట్టణంలోని ట్రస్ట్ కార్యాలయంలో కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను నిర్వాహక సభ్యులతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ జీవనలత మాట్లాడుతూ మహిళల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేలా పలు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మంగళవారం పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులోని గౌతమ్‌గ్రాండ్ హోటల్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రెట్రోడాన్స్, రీల్స్ కాంపిటేషన్, హుక్‌స్టెప్ డాన్స్, పలు రకాల కాంపిటేషన్స్ జరగనున్నట్లు వివరించారు. ఆయా కాంపిటేషన్స్‌లో 500మంది వరకూ మహిళలు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. అనంతరం వివిధ రంగాల్లో ఉత్తమ మహిళలుగా నిలిచిన వారికి ఘనంగా సన్మానించడం జరుగుతుందన్నారు. మహిళలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. చుండూరు వరలక్ష్మి, పి.వసంతదుర్గ, జూటూరి సృజన, గుత్తికొండ జ్యోతికాంత్, తాళ్ళూరి గాయత్రి, గొల్లపూడి అనురాధ, నంబూరు లక్ష్మిఅలేఖ్య, గంగిశెట్టి లీలారాణి, టి.జ్యోతి, రంగరత్నశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీని పరిశీలించిన కమిషనర్



వృద్ధురాలికి పెన్షన్‌ను అందిస్తున్న కమిషనర్ శేషన్న తదితరులు

తెనాలి మారీసుపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలోని 15, 35వ వార్డులలో జరుగుతున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మునిసిపల్ కమిషనర్ శేషన్న పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్లను అందిస్తున్నామన్నారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని శరవేగంగా పూర్తిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. కూటమి ప్రభుత్వం వృద్ధులకు, దివ్యాంగులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందించి వారికి ఆసరాగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి

డ్వాక్రా మహిళల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

● డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి

కొల్లిపర, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక స్త్రీశక్తి భవనంలో యానిమేటర్లతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సమావేశానికి ఏరియా కో-ఆర్డినేటర్ ప్రమీలారాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ డ్వాక్రా రుణాలు ఇప్పించడంతో పాటు సకాలంలో రుణాలు చెల్లించేలా చూడాలన్నారు. స్వయం సహాయక సంఘాలు మరింత అభివృద్ధి చెందేలా తమ వంతు కృషి చేయాలన్నారు. వంద రోజుల ప్రణాళికను పక్కాగా అమలుచేసి డ్వాక్రా సంఘాలకు పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. డ్వాక్రా గ్రూపు సభ్యులు పొదుపును సక్రమంగా చేసుకుంటే అధికంగా రుణాన్ని పొందటానికి అవకాశం ఉందన్నారు. డ్వాక్రా గ్రూపు సభ్యులు ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు మాత్రమే బ్యాంకు రుణాలను వినియోగించాలన్నారు. స్వయం సహాయక సంఘ సభ్యులు ప్రతి నెలా సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదేవిధంగా సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవడం వలన సంఘాలు మరింత బలోపేతం అవటానికి అవకాశం ఉందన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ ఏపీఎం రమాదేవి, సీసీలు విజయకుమార్, మధు, ఎమ్ఎస్‌పీ సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

● డీఎల్‌పీవో స్వరూపరాణి



మున్నంగి పంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎల్‌పీవో స్వరూపరాణి

కొల్లిపర, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డీఎల్‌పీవో విడవలూరి స్వరూపరాణి అన్నారు. శనివారం మండల పరిధిలోని మున్నంగి పంచాయతీ కార్యాలయాన్ని ఆమె తనిఖీ నిర్వహించారు. రికార్డులను పరిశీలించి పంచాయతీ సిబ్బందికి పారిశుధ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలుపై తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా స్వరూపరాణి మాట్లాడుతూ రోడ్ల పక్కన చెత్తచెదారం లేకుండా చూసుకోవాలన్నారు. కాల్వల్లో మురుగునీరు తొలగింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పంచాయతీ అధికారులు స్వచ్ఛ సంపద ప్రాధాన్యంపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. రోడ్డుపక్కన వ్యర్థాలను కాల్చితే తగిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. తడి చెత్తను, పొడి చెత్తను తప్పనిసరిగా వేరుచేయాలన్నారు. పంచాయతీ అధికారులు స్వచ్ఛ సంపద ప్రాధాన్యతను ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. తనిఖీలో ఇన్‌చార్జి ఎంపీడీవో భార్గవ్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

కొల్లిపరలో ఎంఈవో ఆకస్మిక తనిఖీ

కొల్లిపర, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపరలో ప్రాథమిక పాఠశాలలను శనివారం ఎంఈవో ఆకస్మికగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఉపాధ్యాయులు విద్యను బోధించాలని ఎంఈవో సాల్మన్‌రాజు అన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా అమలు చేస్తున్నారా లేదా అని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా అమలు చేయటానికి ప్రధానోపాధ్యాయులు బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఏజెన్సీ నిర్వాహకులు వంట వండే విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆహార పదార్థాలు పిల్లలకు ఇవ్వాలన్నారు. విద్యార్థుల ప్రగతిపై తల్లిదండ్రులతో చర్చించాలన్నారు. పాఠశాలల్లో సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

CHANGE OF NAME

I, **Aluri Rajesh Chowdary S/o Venkateswara Rao,** resident of 4-26, Angalakuduru, Guntur have changed my name from **Aluri Rajesh Choudary (Old name) to Aluri Rajesh Chowdary (New name).** Hereafter I will be known as **Aluri Rajesh Chowdary** for all purposes.